ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

3

గురువారం 27 జూన్ 2024



(పాత చిత్రాలు)

మాచర్ల టీడీపీ కార్యాలయానికి నిప్పుపెట్టిన దృశ్యం



ఈవీఎంను ధ్వంసం చేస్తున్న రామకృష్ణారెడ్డి



పాల్వాయిగేట్ పోలింగ్ బూత్ వద్ద మహిళను హెచ్చరిస్తున్న పిన్నెల్లి



కారంపూడి టీడీపీ ఆఫీసు ధ్వంసం చేస్తూ..

హత్యలు.. దాడులు.. దోపిడీలు.. బెదిరింపులు.. అక్రమ వసూళ్లు.. కేసులు.. అక్రమ వ్యాపారాలు.. భూకబ్జాలకు కేరాఫ్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి. అధికారాన్ని అడ్డంపెట్టుకుని.. వ్యవస్థలను చెరపట్టి.. మాచర్లలో పిన్నెల్లి సోదరులు ఆటవిక రాజ్యం సాగించారు. మాచర్ల నియోజకవర్గాన్ని ఆరాచకాలకు అడ్డాగా మార్చేసి వనరులను దోచుకుంటూ, అక్రమాలను అడ్డుకునే వారిని, ప్రశ్నించే వారిని అంతం చేస్తూ.. ఎదురేలేదన్నట్లుగా చెలరేగిపోయిన పిన్నెల్లి పాపం పండింది. ఇంతకాలం పిన్నెల్లి అరాచకాలకు కొమ్ముకాస్తూ.. సలాం కొడుతూ.. వారు చెప్పినట్లుగా చేస్తూ వచ్చిన పోలీసులే ఎట్టకేలకు బేడీలు వేశారు. కోర్టు రక్షణతో బెయిల్‌పై ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే, వైసీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడైన పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఎట్టకేలకు బుధవారం నరసరావుపేటలో పోలీసులు అరెస్టు చేశారు. పాల్వాయిగేటులో ఈవీఎం ధ్వంసం సీసీ టీవీ ఫుటేజీ బయటకు రావడం.. ఎన్నికల సంఘం కేసులతో పిన్నెల్లి అరాచకాలు ఒక్కోటిగా వెలుగుచూశాయి. ఈవీఎంల ధ్వంసం, మూడు హత్యాయత్నం కేసుల్లో మధ్యంతర బెయిల్‌పై ఉన్న పిన్నెల్లిని పోలీసులు అరెస్టు చేశారు. ఆయన సోదరుడైన పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి మాత్రం ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నాడు.

పాపం పండింది



- ఎట్టకేలకు పిన్నెల్లి అరెస్టు
- కండిషన్ బెయిల్ రద్దుతో జైలుకు
- నరసరావుపేటలో అరెస్టు చేసిన పోలీసులు

నరసరావుపేట(ఆంధ్రజ్యోతి), మాచర్ల టౌన్, జూన్ 26: మాచర్ల మాజీ ఎమ్మెల్యే, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. హైకోర్టు కండీషన్ బెయిల్ రద్దుతో బుధవారం నరసరావుపేటలో ఇంటి వద్ద పోలీసులు పిన్నెల్లిని అరెస్టు చేసి ఎస్పీ కార్యాలయానికి తరలించారు. పోలింగ్ రోజున పాల్వాయి గేటులోని పోలింగ్ బూత్‌లో ఈవీఎం ధ్వంసం, 307 సెక్షన్ కింద నమోదైన మూడు కేసుల్లో ముందస్తు బెయిల్ పిటిషన్లను హైకోర్టు తోసిపుచ్చింది. దీంతో పిన్నెల్లిని పోలీసులు అరెస్టు చేశారు. ఈవీఎంల ధ్వంసం, హత్యాయత్నం కేసులు ముండింటిలో పిన్నెల్లి మధ్యంతర బెయిల్‌పై ఉన్న ఆయన దానిని పొడిగించాలని హైకోర్టులో తాజాగా పిటిషన్లు వేశారు. హత్యాయత్నం కేసుల్లో ముందస్తు బెయిల్ కోరగా కోర్టు తిరస్కరించింది. పిన్నెల్లిపై మొత్తం 14 కేసులు నమోదయ్యాయి. అయనపై 15న మాచర్ల పోలీసు స్టేషన్‌లో రౌడీషిట్ తెరిచిన విషయం తెలిసిందే.

ఎన్నికల్లో గెలుపు కోసం అరాచకాలు..

మాచర్ల నుంచి నాలుగు సార్లు గెలుస్తూ వచ్చిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈ సారి కూడా ఎలాగైనా విజయం సాధించాలని అనేక అరాచకాలకు పాల్పడ్డారు. పిన్నెల్లి ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డితో కలిసి పోలింగ్ రోజున హింసకు పాల్పడ్డారు. పోలింగ్‌కు ముందు రోజు, పోలింగ్ రోజు, ఆ మరుసటి రోజు దారుణాలకు పాల్పడ్డారు. పోలింగ్ ముందు రోజు మే 12న రెంటచింతలలో పిన్నెల్లి అనుచరుడు మోర్తాల ఉమామహేశ్వరరెడ్డి టీడీపీ ఏజెంట్లు మల్లయ్య, సిద్ధయ్యలపై దాడి చేసి గాయపరిచాడు. మే 13 పోలింగ్ రోజున పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రెంటచింతల మండలం పాలువాయిగేటు 202 పోలింగ్ బూత్‌లోకి దౌర్జన్యంగా ప్రవేశించి ఈవీఎం, వీవీప్యాట్లను ధ్వంసం చేశాడు. అడ్డుకోబోయిన టీడీపీ ఏజెంట్ నంబూరి శేషగిరిరావుపై దాడి చేయించారు. ప్రశ్నించిన మరో మహిళ చెరుకూరి నాగశిరోమణిను దూషిస్తూ వేలుచూపి బెదిరించాడు. ఈ ఘటనలో రామకృష్ణారెడ్డిపై 307 సెక్షన్ కింద కేసు నమోదైంది. రెంటాలలో టీడీపీ ఏజెంట్ శేర్రెడ్డి మంజుల, గోపాలరెడ్డిలపై దాడి, కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిపై కారం చల్లి దాడికి యత్నించడం, కారు ధ్వంసం చేసి తగలబెట్టారు. వెల్దుర్తి మండలం కొత్తపుల్లారెడ్డిగూడెంలో టీడీపీ ఏజెంట్ రేఖ్యానాయక్‌పై దాడి చేసిన ఘటనలో కూడా రామకృష్ణారెడ్డిపై 307 సెక్షన్ కింద కేసు నమోదైంది. కండ్లకుంలో టీడీపీ ఏజెంట్‌గా కూర్చున్న నోముల మాణిక్యరావు కుటుంబసభ్యులపై వెంకట్రామిరెడ్డి దాడి చేయించి వీడియో చూపించి ఏజెంట్‌ను బయటకు లాగేశారు. మాచర్ల పీడబ్ల్యూడీ కాలనీలో తన గ్యాంగ్‌ను వెంట వేసుకొచ్చి కారుతో ఢీకొట్టి 8 మందిని తీవ్రంగా గాయపరిచాడు. టీడీపీ నేత యెనుముల కేశవరెడ్డి గృహం ధ్వంసం చేశాడు. పోలింగ్ మరుసటి రోజు కారంపూడిలో రౌడీగ్యాంగును వెంటబెట్టుకుని వెళ్లి టీడీపీ కార్యాలయం, టీడీపీ సానుభూతిపరుల దుకాణాలు, కార్లు ధ్వంసం చేసి నిప్పు పెట్టారు. అడ్డుకున్న సీఐ నారాయణస్వామి తలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ దాడిలో రామకృష్ణారెడ్డిపై 307 కేసు నమోదైంది. ఇవి కాక మరో 11 ఘర్షణల్లో వివిధ సెక్షన్ల కింద రామకృష్ణారెడ్డిపై కేసులు నమోదయ్యాయి. ఇలా మొత్తం పిన్నెల్లిపై మాచర్ల నియోజకవర్గంలోని పోలీసు స్టేషన్లలో 14 కేసులు నమోదయ్యాయి.

ఎన్నికల్లో ప్రజలు తిరుగుబాటు

పోలీసులు పిన్నెల్లికి తొత్తుల్లా పనిచేస్తుంటే, అధికారులు అడుగులకు మడుగులొత్తుతుంటే. ఇన్నాళ్లూ వారి ఆరాచకాల్ని మౌనంగా భరించిన నియోజకవర్గ ప్రజలే తాజా ఎన్నికల్లో తిరగబడ్డారు. సామాన్య మహిళలు ఎమ్మెల్యేను నిలదీయడమే కాకుండా, ఎదిరించి, వెంబడించి తరిమేయడం ప్రజల్లో వచ్చిన మార్పునకు నిదర్శనం. పిన్నెల్లి సోదరులు ఐదేళ్లుగా చేసిన అరాచకాల్ని ఇక భరించలేని పరిస్థితితో సహనం నశించిన ప్రజల్లో తెగువ వచ్చింది. బతికిబట్ట కట్టాలంటే ఈ ఎన్నికల్లో పిన్నెల్లిని ఓడించాలన్న కసితో ప్రజలు పనిచేశారు. నియోజకవర్గాన్ని ఇన్నాళ్లూ కనుసైగతో శాసించిన పిన్నెల్లి సోదరులు ప్రజల్లో వచ్చిన మార్పును జీర్ణించుకోలేక.. విచక్షణ కోల్పోయి. ఎక్కడికక్కడ దాడులకు తెగబడ్డారు. పిన్నెల్లిని ఓడించడం ద్వారా అయన నెర సామ్రాజ్యానికి కూకటి వేళ్లతో ప్రజలు పెకలించగా తాజా అరెస్టుతో పోలీసులు పిన్నెల్లి శకానికి ముగింపు పలికారు.



పిన్నెల్లి అరెస్టు ఇలా..

ముందస్తు బెయిల్ కోసం పిన్నెల్లి రామకృష్ణరెడ్డి వేసిన పిటిషన్లను హైకోర్టు బుధవారం మధ్యాహ్నం కొట్టేసింది. దీంతో పిన్నెల్లికి ముందస్తు బెయిల్ రద్దు అయినట్టు పోలీసులకు కోర్టు నుంచి 3.00 గంటల సమయంలో సమాచారం అందింది. నరసరావుపేటలో ఆయన ఉంటున్న ఇంటి వద్దకు చేరుకున్న పోలీసులు 3.47 గంటల సమయంలో అదుపులోకి తీసుకుని ఎస్పీ కార్యాలయానికి తరలించారు. పిన్నెల్లిని అరెస్టు చేసినట్టు ఎస్పీ మల్లికాగార్గ్ రాత్రి 7 గంటల సమయంలో ప్రకటించారు. వైద్య పరీక్షల నిమిత్తం ఎస్పీ కార్యాలయం నుంచి నరసరావుపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి 8 గంటల సమయంలో తరలించారు. అనంతరం 9.13 గంటలకు ఆస్పత్రి నుంచి ఎస్పీ కార్యాలయానికి ఆయన్ను తరలించారు. మాచర్ల నియోజకవర్గంలో కేసులు నమోదు కావడంతో ఆయన్ను మాచర్ల కోర్టులో హాజరు పరచాలని పోలీసులు నిర్ణయించారు. రాత్రి 10 గంటల సమయంలో ఎస్పీ కార్యాలయం నుంచి పిన్నెల్లిని మాచర్ల కోర్టులో హాజరు పరిచేందుకు తరలించారు.

అరెస్టుపై హర్షం.. కారంపూడిలో సంబరాలు

మాచర్లటౌన్: మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టుపై ఆయన బాధితులు హర్షం వ్యక్తం చేశారు. కారంపూడిలోని సినిమాహాలు, ఇందిరా గాంధీ బొమ్మ సెంటర్లో పలువురు బాణాసంచా పేల్చారు. ఐదేళ్లపాటు ఎటువంటి తప్పులు చేయకున్నా అక్రమ కేసులు పెట్టి జైలు పాలు చేసిన రామకృష్ణారెడ్డికి సరైన శిక్ష పడిందంటూ బాధితులు పలువురు ఆనందం వ్యక్తం చేశారు.

హత్యలు

వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన టీడీపీ కార్యకర్త తోట చంద్రయ్యను అదే గ్రామానికి చెందిన చింతా శివరామయ్య, ఆదినారాయణతో హత్య చేయించారు. దుర్గి మండలం జంగమహేశ్వరపాడులో కంచర్ల జల్లయ్యను అదే గ్రామానికి చెందిన ఊరిబండి మన్నెయ్యతో హత్య చేయించారు.

భూకబ్జాలు

మాచర్ల మండలం నాగులవరం పంచాయతీ పరిధిలోని విజయపురిసౌత్ పరిధిలో సుమారు 400 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించారు. వెల్దుర్తి మండలం కండ్లకుంటలో 1500 ఎకరాలు, మాచర్ల పట్టణంలోని నెహ్రూనగర్ సమీపంలో చెన్నకేశవస్వామి మాన్యం భూములు 7 ఎకరాలు, నరసరావుపేట రోడ్డులో వేంకటేశ్వరస్వామి మాన్యం 2 ఎకరాలు, కొత్తపల్లి జంక్షన్లో 5 ఎకరాలు కబ్జా చేశారు. పట్టణంలో టీడీపీ దివంగత సీనియర్ నేత వీరమాచినేని సుభాష్‌చంద్రబోస్‌కు చెందిన రూ.కోట్ల విలువైన ఆస్తులను బినామీ పేర్లతో కబ్జా చేశారు.

భయాందోనలతో ఏకగ్రీవాలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ తరపున నామినేషన్ వేద్దామను కున్న అభ్యర్థులకు పోలీ సులే ఫోన్లు చేసి, పోటీ ఆలోచన మానుకోకపోతే గంజాయి వ్యాపారం చేస్తున్నావని కేసులు పెడ తామని బెదిరించారు. వాటికీ లొంగని వారిపై భౌతిక దాడులు చేయించి అన్ని పంచాయతీలు, మున్సిపాలిటీ, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ఇలా అన్ని ఎన్నికల్లోనూ ఏకగ్రీ వం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల సరళిని పరిశీలించేందుకు వచ్చిన టీడీపీ బృందం బొండా ఉమ, బుద్ధా వెంకన్న, హైకో ర్టు న్యాయవాదిపై మాచర్లలోని రింగురోడ్డు సెంటర్లో తురకా కిషోర్‌తో దాడి చేయించారు. దాడికి దిగిన తురకా కిషోర్‌ను ఏకంగా మున్సిపల్ చైర్మన్ చేశారు.

ఆస్తుల ధ్వంసం

2022 డిసెంబరు 16న ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా పిన్నెల్లి రౌడీ గ్యాంగ్ టీడీపీ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డిపై కవ్వింపు చర్యలకు దిగింది. దీంతో పోలీసులు బ్రహ్మారెడ్డిని ఊరు నుంచి బయటకు పంపేశారు. తదుపరి ఎమ్మెల్యే సోదరుడు వెంకట్రామిరెడ్డి తన రౌడీ గ్యాంగుతో పట్టణంలోని టీడీపీ కార్యాలయంపై దాడి చేసి దహనం చేశాడు. ఆ తర్వాత పట్టణంలోని టీడీపీ నాయకులకు చెందిన ఇళ్లపైకి వెళ్లి వారి ఆస్తులను, వాహనాలను ధ్వంసం చేశారు. పట్టణం రావణకాష్టంగా మార్చిన వారిని వదిలేసిన పోలీసులు టీడీపీ వారిపైనే 307 కేసులు కట్టి జైలుపాలు చేశారు.

అక్రమ వసూళ్లు

గ్రానైట్ లారీల నుంచి అక్రమ వసూళ్లు, రేషన్ బియ్యం, గుట్కా, పాన్‌పరాగ్, గంజాయి, తెలంగాణ మద్యం, బెల్ట్‌షాపులు ద్వారా కోట్లాది రూపాయలు అక్రమంగా కూడబెట్టుకున్నారు. నియోజకవర్గ పరిధిలో వెంచర్లు వేయాలన్నా, నిర్మాణాలు చేపట్టాలన్నా ఐదు శాతం వాటా సమర్పించుకోవాలి. అపార్ట్మెంట్ కట్టేవారి నుంచి రూ.20- 30 లక్షల వరకు వసూలు చేశారు. రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్, సెబ్ తదితర కార్యాలయాల నుంచి ముడుపులు దండుకున్నారు.

మాచర్లలో ఆటవికరాజ్యం

మాచర్లలో ఐదేళ్లు అరాచకం

మాచర్ల మాజీ ఎమ్మెల్యే రాజకీయ జీవితమంతా నేరమయమే. హత్యలు, దాడులు, కబ్జాలతో చెలరేగిపోయి రౌడీ సామ్రాజ్యాన్ని నెలకొల్పారు. నియోజకవర్గ పరిధిలోని వెల్దుర్తి జడ్పీటీగా రాజకీయ జీవితం ప్రారంభించారు. ఆ తర్వాత 2009లో ఎమ్మెల్యేగా మాచర్ల నుంచి పోటీ చేసి అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. ఇక అప్పటి నుంచి వరుసగా 2019 వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తూ వచ్చారు. ఈ క్రమంలో నియోజకవర్గంలో ఆధిపత్యం కోసం, పట్టు కోసం ప్రత్యర్థి పార్టీ నాయకులను టార్గెట్ చేసుకుని అనేక ఇబ్బందులకు గురి చేశాడు. ప్రభుత్వం ఏదైనా నియోజకవర్గంలో తనకు ఎదురులేకుండా చేసుకున్నాడు. ఈ పరిస్థితుల్లో 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇక ఆయనకు తిరుగే లేకుండా పోయింది. దౌర్జన్యాలు, దాడులతో దోపిడీలకు తెగబడ్డాడు. నియోజకవర్గంలోని టీడీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని పోలీసులతో దాడి చేయించి గ్రామాలు విడిచి పోయేలా చేశాడు. 20 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి రాజ్యాంగం, వ్యవస్థలంటే కనీస గౌరవం లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించాడు. ఐదేళ్లుగా మాచర్ల నియోజకవర్గాన్ని తన సొంత సామ్రాజ్యంలా, ఆటవికరాజ్యంలా, ఆరాచకాలకు అడ్డాగా మార్చేశాడు. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పార్టీ ముఠాలు టీడీపీ మద్దతుదారుల్ని గ్రామాల నుంచి తరిమికొట్టాయి. 2020లో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జంగమేశ్వరపాడులో టీడీపీ శ్రేణులపై వైసీపీ వర్గీయులు దాడి చేయడంతో 60 కుటుంబాలు ఊరు విడిచి వెళ్లిపోయాయి. గుండ్లపాడు నుంచి కొన్ని కుటుంబాలు వెళ్లిపోయాయి.

ఇక నియోజకవర్గ పరిధిలోని వనరులన్నీ దోచుకుంటూ, ప్రతిపక్షనాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులపై దాడులకు, హత్యాకాండకు తెగబడుతూ సాగించిన దాష్టీకాలు అన్నీ ఇన్నీకావు. నియోజకవర్గంలో ప్రతిపక్షం అన్నది లేకుండా నిర్మూలించాలన్నట్లుగా బరితెగించాడు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక పిన్నెల్లి సోదరులకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డితో కలిసి ఐదేళ్లలో చేసిన అరాచకాలు, అకృత్యాలు, దారుణాలు, దోపిడీలు అన్ని ఇన్ని కావు. సోదరుల నేర సామ్రాజ్యం విస్తరించుకున్నారు. అన్ని పదవులు, కాంట్రాక్టులు పిన్నెల్లి సోదరులకు, వాళ్ల మనుషులకే దక్కించుకున్నారు. ఐదేళ్లలో నియోజకవర్గాన్ని వారు పీల్చిపిప్పి చేశారు. వెంకట్రామిరెడ్డి కనుసన్నల్లో అక్రమ మద్యం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లింది. తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తెచ్చి విక్రయించేవారు. ప్రభుత్వ దుకాణాలకు వచ్చిన మద్యాన్ని సొంత షాపులు, బార్లకు తరలించుకున్నారు. ప్రతి సీసాపై రూ.60 నుంచి రూ.120 వరకు అధికంగా విక్రయించి సొమ్ము చేసుకున్నారు. తెల్ల రాయి అక్రమ క్వారీయింగ్ చేసి కోట్లు సంపాదించారు. బాపట్ల, ప్రకాశం, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి మాచర్ల నియోజకవర్గం మీదుగా తెలంగాణకు వెళ్లే గ్రానైట్ లారీల నుంచి పిన్నెల్లి అనుచరులు మనుషులు రూ.12 వేల చొప్పున కప్పం కట్టించుకున్నారు. జనాల్ని భయపెట్టి, బెదిరించి వారి ఆస్తులు లాక్కున్నారు. పోలీసులు ఈ ఐదేళ్లలో ఒక్కసారి కూడా పిన్నెల్లి సోదరుల జోలికి వెళ్లలేదు. ఎస్పీ మొదలు హోంగార్డు వరకు పోలీసు వ్యవస్థ మొత్తం వారికి దాసోహమై ఊడిగం చేసింది. ఎమ్మెల్యే, ఆయన సోదరుడు, అనుచరులంటే పోలీ సులకు హడల్. ప్రతి స్టేషన్లోనూ పిన్నెల్లి మనుసులు ఇద్దరో, ముగ్గురో హోంగార్డులుగా పనిచేస్తుంటారు. స్టేషన్లో ఏం జరిగినా క్షణాల్లో పిన్నెల్లికి చేరవేసేవారు.



పిన్నెల్లిని అరెస్టు చేసి తీసుకు వెళుతున్న పోలీసులు

పరారీలోనే పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి

షాడో ఎమ్మెల్యేగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డి అధికారం అండతో చెలరేగిపోయాడు. నియోజకవర్గంలో పోలీసు వ్యవస్థలను తన చెప్పు చేతల్లో పెట్టుకుని హత్యలు, అరాచకాలకు పాల్పడ్డాడు. తనకు ఎదురే లేదన్న రీతిలో వ్యవహరించిన వెంకట్రామిరెడ్డి పోలింగ్, ఆ తర్వాత విధ్వంసకాండకు పాల్పడ్డాడు. ఈ కేసుల భయంతో మే 14న తన అన్న రామకృష్ణారెడ్డితో కలసి పరారయ్యాడు. అప్పటి నుంచి అజ్ఞాతంలోనే కొనసాగుతున్నాడు. ఆయన్ను అరెస్టు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నియోజకవర్గంలో ప్రత్యర్థులను భయ భ్రాంతులకు గురిచేసిన షాడో ఎమ్మెల్యేగా వ్యవహరించిన వెంకట్రామిరెడ్డి కేసుల భయంతో తలదాచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొందరు పోలీసు అధికారుల సహకారంతోనే అయన తప్పించుకు తిరుగుతున్నాడన్న ఆరోపణలున్నాయి. వెంకట్రామిరెడ్డిపై రెండు హత్యాయత్నం కేసులతో సహా మొత్తం 9 కేసులు నమోదయ్యాయి. వెంకట్రామిరెడ్డికి ఇంకా కొందరు పోలీసులు సహకరిస్తున్నారన్న విమర్శలున్నాయి. పోలీసులు తలచుకుంటే వెంట్రామిరెడ్డిని పట్టుకోవడం పెద్ద పని కాదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.



రెంటాలలో దగ్ధమవుతున్న బ్రహ్మారెడ్డి వాహనం

రైతులపై దాడి..పంటలు ధ్వంసం

పిడుగురాళ్ల: మాచవరం మండలం చెన్నాయపాలెం సమీపంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు సరస్వతి పవర్ ప్రాజెక్టు, సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం కొరకు 2010లో సుమారు 1200 ఎకరాలను రైతుల నుంచి కొనుగోలు చేశారు. అయితే 2014 వరకు ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టలేదు. దీంతో రైతులు తమ భూముల్లో సాగు చేసుకుంటామని పనులు మొదలు పెట్టిన తర్వాత అప్పగిస్తామని చెప్పారు. అయితే భూముల్లోకి ఎవరినీ జగన్మోహన్‌రెడ్డి కుటుంబసభ్యులు అడుగుపెట్టనివ్వలేదు. ఈ క్రమంలో 2014లో టీడీపీ అధికారంలోకి రావడంతో రైతులు తమ భూముల్లో పలు రకాల పంటలను సాగుచేశారు. ఆ తర్వాత అదే సంవత్సరం అక్టోబరులో అప్పటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిలు 40 ట్రాక్టర్లలో వందలాది మంది అనుచరులతో చెన్నాయపాలెం చేరుకుని రైతులు సాగుచేస్తున్న పంటలను ట్రాక్టర్లతో దున్నించి ధ్వంసం చేశారు. అడ్డు వచ్చిన రైతులు, ఎస్సీ ఎస్టీ మహిళలను కూడా కులంపేరుతో దూషించడమే కాకుండా పెట్రోలు పోయడం, మారణాయుధాలతో దాడి చేశారు. దీంతో మాచవరం పోలీసులు పిన్నెల్లి సోదరులపై కేసులు నమోదు చేశారు.

చెన్నాయపాలెం వద్ద సరస్వతి సిమెంట్ ఫ్యాక్టరీకి చెందిన భూములు



తనిఖీలు నిల్.. అక్రమ రవాణా ఫుల్


దాచేపల్లి, జూన్ 26: ఆంధ్రా - తెలంగాణ సరిహద్దుగా పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం తంగెడ - మటంపల్లి గ్రామాల మధ్య వున్న కృష్ణానదిపై నిర్మించిన బ్రిడ్జి అక్రమార్కులకు వరంగా మారింది. ఇక్కడ రవాణాశాఖ తనిఖీలు లేకపోవడంతో ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ప్రభుత్వ పన్నులు చెల్లించకుండా యథేచ్ఛగా సరుకు రవాణా జరుగుతోంది. అదేవిధంగా ఇసుక, మద్యం, గంజాయి వంటి చట్టవిరుద్ధమైన రవాణా జరుగుతున్నా పరిశీలించేవారు. తనిఖీలు చేసేవారు లేకపోవడంతో అక్రమార్కులకు అవకాశంగా మారింది. దాచేపల్లి నుంచి తంగెడ మీదుగా తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేట జిల్లా మటంపల్లి, హుజుర్‌నగర్, కోదాడ మీదుగా విజయవాడ, హైదరాబాద్‌కు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ వాహనాలకు సరుకు రవాణాకు సంబంధించిన అనుమతి పత్రాలు లేకున్నా పరిశీలించేవారు లేరు. బ్రిడ్జి నిర్మాణం జరిగి ఏడేళ్ల కావస్తున్నా ఇంతవరకు ఏపీ రవాణాశాఖ చెక్‌పోస్టును ఏర్పాటు చేయలేదు. రాష్ట్ర సరిహద్దులు దాటించడానికి తంగెడను అక్రమ వ్యాపారులు వినియోగించుకుంటున్నారు. బియ్యం కూడా ఈ మార్గం గుండా రాష్ట్ర సరిహద్దులు దాటుతున్నట్లుగా సమాచారం. పగలు, రాత్రి తేడా లేకుండా రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రభుత్వానికి లక్షల రూపాయల ఆదాయం సమకూర్చే రవాణా శాఖ కార్యాలయం కూడా ఇక్కడ లేకపోవడం గమనించదగ్గ విషయం. అంతేకాకుండా ఈ మార్గం గుండా గ్రానైట్ రాళ్ల, ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో అతిపెద్దదైన కోదాడ సంత నుంచి వందల సంఖ్యల్లో వాహనాల్లో పశువులను తరలిస్తుంటారు. కోదాడ, ఖమ్మం, నల్గొండ, హైదరాబాద్‌కు మిర్చి రవాణా జరుగుతుంది. నిత్యం వాహనాలతో రద్దీగా వుండే ఈ రహదారిపై ఎటువంటి తనిఖీలు చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని చూపుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ ప్రాంతంలో రవాణాశాఖ చెక్‌పోస్టును ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతో పాటు అక్రమ రవాణాను అడ్డుకోవచ్చు. పన్నుల రూపంలో లక్షల రూపాయల ఆదాయం ప్రభుత్వానికి సమకూరుతుంది. ఈ విషయంపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

తంగెడ : కృష్ణానది బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌పోస్టు



దిక్సూచి DIKSUCHI

పీజీ, పీహెచ్‌డీ



నలంద యూనివర్సిటీ

బిహార్‌లోని నలంద యూనివర్సిటీ-మాస్టర్స్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. మాస్టర్స్‌లో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంబీఏ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. విదేశీ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంగ్లీష్ మాట్లాడని దేశాలకు చెందిన అభ్యర్థులు, ఆంగ్ల మాధ్యమంలో చదవని వారు టోఫెల్/ఐఈఎల్‌టీఎస్/టీఓఈఐసీ/ పీటీఈ/ ఎస్‌టీఈపీ అర్హత పొంది ఉండాలి. అభ్యర్థులు గరిష్ఠంగా రెండు ప్రోగ్రామ్‌లకు అప్లయ్ చేసుకొనే వీలుంది. మాస్టర్స్ ప్రోగ్రామ్‌ల వ్యవధి రెండేళ్లు. పీహెచ్‌డీ వ్యవధి నాలుగేళ్లు. ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ఏడాది కోర్సు పూర్తిచేసిన తరవాత డిప్లొమాతో ప్రోగ్రామ్‌నుంచి వైదొలగే వీలుంది.

- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** హిందూ స్టడీస్(సనాతన), వరల్డ్ లిటరేచర్, హిస్టారికల్ స్టడీస్, బుద్దిస్ట్ స్టడీస్-ఫిలాసఫీ అండ్ కంపారటివ్ రెలిజియన్స్, ఇంటర్నేషనల్ రిలేషన్స్ అండ్ పీస్ స్టడీస్, ఆర్కియాలజీ
- **ఎంబీఏ స్పెషలైజేషన్:** సస్టయినబుల్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్
- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్:** ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్ స్టడీస్
- **పీహెచ్‌డీ స్పెషలైజేషన్‌లు:** వరల్డ్ లిటరేచర్, సస్టయినబుల్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్, ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్ స్టడీస్, హిస్టారికల్ స్టడీస్, బుద్దిస్ట్ స్టడీస్-ఫిలాసఫీ అండ్ కంపారటివ్ రెలిజియన్స్, హిందూ స్టడీస్(సనాతన)

అర్హత

- మాస్టర్స్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీ (హ్యూమానిటీస్/సైన్సెస్/ఇంజనీరింగ్/మేనేజ్‌మెంట్/లా) ఉత్తీర్ణులై ఉండాలి. 250 పదాలకు మించకుండా సెల్ఫ్ ఇంట్రడక్షన్/ బయోనోట్ స్టేట్‌మెంట్ సబ్మిట్ చేయాలి. స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్(ఎస్‌ఓపీ)లో భాగంగా వంద పదాలకు మించకుండా నలంద యూనివర్సిటీలో చదవాలనుకోవడానికి కారణాలు, 300 నుంచి 500 పదాలకు మించకుండా సంబంధిత ప్రోగ్రామ్‌ను ఎంచుకోవడానికి గల కారణాలు వివరిస్తూ ఆర్టికల్ రాయాలి.
- ఎంబీఏ (సస్టయినబుల్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్) ప్రోగ్రామ్‌లో చేరాలనుకొనేవారు కనీసం 70 శాతం స్కోర్‌తో క్యాట్/ఎక్స్‌ఏటీ/మ్యాట్ అర్హత పొంది ఉండాలి. ప్రభుత్వ సంస్థలు/ప్రముఖ పీఎస్‌యూలలో కనీసం అయిదేళ్ల అనుభవం ఉన్న వర్కింగ్ ఎగ్జిక్యూటివ్‌లకు ఈ స్కోర్ అవసరం లేదు. విదేశీ విద్యార్థులకు జీమ్యాట్ స్కోర్ లేదా డిగ్రీ స్థాయిలో 3/4 జీపీఏ ఉండాలి.
- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి కనీసం 65 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ/ఎంఫిల్ పూర్తిచేసి ఉండాలి. సెల్ఫ్ ఇంట్రడక్షన్, రికమండేషన్/రిఫరెన్స్ లెటర్స్, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, రీసెర్చ్ ప్రపోజల్, ఏవైనా రెండు/మూడు పబ్లిష్డ్ లేదా నాన్ పబ్లిష్డ్ పేపర్స్ సబ్మిట్ చేయాలి. పార్ట్ టైం ప్రోగ్రామ్‌లో చేరాలంటే కనీసం ఎనిమిది నుంచి పదేళ్ల అనుభవం ఉండాలి.

ఎంపిక: ప్రోగ్రామ్‌ను అనుసరించి అకడమిక్ ప్రతిభ, జాతీయ పరీక్ష స్కోర్, ఇంగ్లీష్ సంబంధిత టెస్ట్ స్కోర్‌లు, ఎస్‌ఓపీ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. ప్రవేశాలు పొందిన అభ్యర్థులకు ఈమెయిల్ ద్వారా సమాచారమిస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 10
- **వెబ్‌సైట్:** nalandauniv.edu.in

పెట్రో వర్సిటీ

అమేథీలోని రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ(ఆర్‌జీఐపీటీ)- ఎంటెక్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రెగ్యులర్, ఎక్స్‌టర్నల్, స్పాన్సర్డ్, పార్ట్ టైం విధానాల్లో ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. జైస్‌లోని ఆర్‌జీఐపీటీ, బెంగళూరులోని ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్, శివసాగర్‌లోని అస్సాం ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్ క్యాంపస్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

ఎంటెక్ విభాగాలు-సీట్లు: జైస్ ఆర్‌జీఐపీటీలో కెమికల్ ఇంజనీరింగ్, పెట్రోలియం ఇంజనీరింగ్ విభాగాల్లో ఒక్కోదానిలో 10 సీట్లు ఉన్నాయి. బెంగళూరు ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్‌లో రెన్యూవబుల్ ఎనర్జీ 15, ఎలక్ట్రానిక్ వెహికిల్ టెక్నాలజీ 20 సీట్లు ఉన్నాయి.

పీహెచ్‌డీ విభాగాలు-సీట్లు

- జైస్ ఆర్‌జీఐపీటీలో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ బయోకెమికల్ ఇంజనీరింగ్ 6, సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ 7, పెట్రోలియం ఇంజనీరింగ్ అండ్ జియో ఇంజనీరింగ్ 3, మేథమెటికల్ సైన్సెస్ 3, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 2, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 6, మేనేజ్‌మెంట్ స్టడీస్ 2 సీట్లు ఉన్నాయి.
- ఈఐబీ సెంటర్లో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెటీరియల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాలకు గాను మొత్తం 6 సీట్లు ఉన్నాయి.
- ఏఈఐ సెంటర్లో కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, పెట్రోలియం ఇంజనీరింగ్, ఫిజిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫైర్ అండ్ సేఫ్టీ ఇంజనీరింగ్ విభాగాలకు గాను మొత్తం 9 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు

- ఎంటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది.
- పీహెచ్‌డీలో ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధిత విభాగంలో ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఈ/ఎంటెక్ లేదా కనీసం 65 శాతం మార్కులతో మాస్టర్స్ ఇన్ సైన్స్ లేదా 75 శాతం మార్కులతో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. సైన్సెస్ విభాగాలకు ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ ఇన్ సైన్స్ లేదా కనీసం 75 శాతం మార్కులతో బ్యాచిలర్స్ ఇన్ సైన్స్ ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి. హ్యూమానిటీస్ విభాగాలకు ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ ఇన్ ఇంజనీరింగ్ లేదా మాస్టర్స్ డిగ్రీ(హ్యూమానిటీస్/సైన్సెస్) లేదా 75 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ(ఇంజనీరింగ్/సైన్సెస్)+రెండేళ్ల అనుభవం ఉండాలి. మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాలకు ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ (మేనేజ్‌మెంట్) లేదా 75 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ(ఇంజనీరింగ్)+రెండేళ్ల అనుభవం ఉండాలి. అన్ని విభాగాలకు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ఎంపిక

- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి గేట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి ఇంటర్వ్యూలు నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. గేట్ స్కోర్ లేని అభ్యర్థులు సంస్థ నిర్వహించే రిటెన్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. ఇందులో అర్హత పొందినవారిని మాత్రమే ఇంటర్వ్యూకి పిలుస్తారు.
- పీహెచ్‌డీలో ప్రవేశానికి కూడా సంస్థ నిర్వహించే రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సి ఉంటుంది. నేషనల్ లెవెల్ స్కాలర్‌షిప్‌లు సాధించినవారు, కనీసం 80 శాతానికి మించి అకడమిక్ మార్కులు ఉన్నవారు ఇంటర్వ్యూలకు హాజరైతే చాలు.
- ఎక్స్‌టర్నల్, స్పాన్సర్డ్, పార్ట్ టైం ప్రోగ్రామ్‌లలో చేరేవారు రాత పరీక్ష రాయనవసరం లేదు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ. 500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** జూలై 5
- **రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు:** జూలై 11, 12
- **అడ్మిషన్స్ పొందిన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 16
- **తరగతులు ప్రారంభం:** జూలై 30 నుంచి
- **వెబ్‌సైట్:** rgipt.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/laCRootలో చదవండి.

కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో జీఎంఈ ట్రెయినింగ్

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఆధ్వర్యంలోని మెరైన్ ఇంజనీరింగ్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎంఈటీఐ)- గ్రాడ్యుయేట్ మెరైన్ ఇంజనీరింగ్(జీఎంఈ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో భాగంగా ఏడాదిపాటు ప్రీ సీ ట్రెయినింగ్ ఉంటుంది. ఇది ఏడాది వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఈ ప్రోగ్రామ్‌నకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ (డీజీఎస్) గుర్తింపు ఉంది. స్టయిపెండ్ సౌకర్యం లేదు. మొత్తం 114 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తయిన వెంటనే ఆర్నెల్ల వ్యవధిగల షిప్‌బోర్డ్ ట్రెయినింగ్ పొందాల్సి ఉంటుంది. ఈ శిక్షణ పూర్తిచేసుకొన్న అభ్యర్థులకు డీజీఎస్ నిర్వహించే ఎంఈఓ క్లాస్- 4 సీఓసీ ఎగ్జామ్ రాసేందుకు అర్హత లభిస్తుంది.



ప్రోగ్రామ్ వివరాలు: ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. డీజీఎస్, ఇంటర్నేషనల్ మారిటైం ఆర్గనైజేషన్(ఐఎంఓ) నిబంధనల ప్రకారం క్లాస్ రూం తరగతులు, ల్యాబొరేటరీ వర్క్‌లు, వర్క్‌షాప్ ప్రాక్టీస్‌లతోపాటు సీ ట్రెయినింగ్ ఉంటాయి. అభ్యర్థులందరూ ట్రెయినింగ్ మాన్యువల్, వర్క్ డెయిరీ మెయింటైన్ చేయాల్సి ఉంటుంది. సమయానుసారం రిటెన్ టెస్ట్‌లు, ప్రాక్టికల్ టెస్ట్‌లు నిర్వహిస్తారు. అడ్మిషన్ నాటికి పాస్‌పోర్ట్ పొంది ఉండాలి.

- ప్రోగ్రామ్‌నకు సంబంధించిన స్టడీ మెటీరియల్, టూల్ బుక్, ట్రెయినింగ్ మాన్యువల్ అందిస్తారు. భోజన, వసతి సౌకర్యాలకు సంబంధించిన ఖర్చులన్నీ కోర్సు ఫీజులోనే ఉంటాయి. వర్కింగ్ డ్రెస్ కింద ఒక జత సేఫ్టీ షూస్, రెండు జతల బ్లాక్ సాక్స్, ఒక సేఫ్టీ హెల్మెట్ ఇస్తారు. యూనిఫామ్ కింద అయిదు వైట్ షర్ట్‌లు, రెండు బ్లాక్ ప్యాంట్‌లు, ఒక వైట్ ప్యాంట్, వైట్ క్యాప్, ఒక జత ఎపొలెటర్‌లు ఇస్తారు. పీటీ డ్రెస్ కింద రెండు బ్లూ షార్ట్‌లు, రెండు జతల వైట్ టీ షర్ట్‌లు, రెండు జతల వైట్ సాక్స్, ఒక స్విమ్మింగ్ ట్రంక్ ఇస్తారు. పర్సనల్ లాకర్, నాలుగు బెడ్‌షీట్‌లు, ఒక పిల్లో, రెండు పిల్లో కవర్‌లు, రెండు టవల్స్, ఒక మ్యాట్రెస్ కవర్ కూడా ఇస్తారు.
- ఎంపికైన అభ్యర్థులు ఒక జత బ్లాక్ షూస్, ఒక జత వైట్ కాన్వాస్ పీటీ షూస్, రెండు బ్లాక్ ప్యాంట్‌లు, మూడు బాయిలర్ సూట్‌లు(ఆరెంజ్ కలర్ ఫుల్ స్లీవ్స్ కాటన్), రెండు స్లీపింగ్ సూట్స్ (వైట్), ఒక జత స్లిప్పర్స్, షూ బ్రష్, షూ పాలిష్ (బ్లాక్, వైట్), రెయిన్ కోట్, రెండు బాత్ రోబ్స్ వెంట తెచ్చుకోవాలి. ఒక పాకెట్ క్యాలిక్యులేటర్, ఇంజనీరింగ్ డ్రాయింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్ కూడా తెచ్చుకోవాలి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి (బీఈ/బీటెక్) (మెకానికల్ ఇంజనీరింగ్/మెకానికల్ అండ్ ఆటోమేషన్/మెకానికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/మెకానికల్ అండ్ ఆటోమొబైల్స్/నేవల్ ఆర్కిటెక్చర్ అండ్ ఓషన్ ఇంజనీరింగ్/ నేవల్ ఆర్కిటెక్చర్ అండ్ షిప్ బిల్డింగ్/మెరైన్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. పదోతరగతి/ఇంటర్/ డిప్లొమా/డిగ్రీ స్థాయిలో ఇంగ్లీష్ సబ్జెక్టులో ద్వితీయ శ్రేణి మార్కులు ఉండాలి. డీజీఎస్ నిర్దేశించిన ప్రకారం మెడికల్ ఫిట్‌నెస్ ఉండాలి. అభ్యర్థుల వయసు ప్రోగ్రామ్ ప్రారంభం నాటికి 28 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: అకడమిక్ మెరిట్, మెడికల్ ఫిట్‌నెస్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. సందర్భానుసారం సైకలాజికల్ స్క్రీనింగ్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.4,75,000
- **అడ్మిషన్ ఛార్జెస్:** రూ.10,000
- **దరఖాస్తు:** వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి ఈ మెయిల్ ద్వారా పంపాలి. నిర్దేశిత పత్రాలు అప్‌లోడ్ చేయాలి.
- **హార్డు కాపీ చేరేందుకు చివరి తేదీ:** జూలై 31
- **చిరునామా:** హెచ్‌ఓడీ, మెరైన్ ఇంజనీరింగ్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎంఈటీఐ), విజ్ఞాన సాగర్, గిరినగర్-682020, ఎర్నాకుళం, కేరళ.
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** సెప్టెంబరు 1 నుంచి
- **ఈ-మెయిల్:** metihod@cochinshipyard.in
- **వెబ్‌సైట్:** www.cochinshipyard.in



నవ్య | చిత్రజ్యోతి

39 ఏళ్ల తర్వాత ఒకే ఫ్రేమ్‌లో



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ ప్రాజెక్ట్ ప్రకటించినప్పటి నుంచే ఎన్నో ఆసక్తికర అంశాలతో భారతీయ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. దశాబ్దాల తర్వాత బాలీవుడ్ సూపర్‌స్టార్ అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్ కలయికకు ఈ చిత్రం వేదిక అవ్వడం ఓ విశేషం. 1985లో వచ్చిన 'గిరఫ్తార్' చిత్రంలో అమితాబ్, కమల్ అన్నదమ్ములుగా నటించారు. మళ్లీ ఇన్నాళ్లకు 'కల్కి' చిత్రంతో వీరి కాంబినేషన్ సెట్టయింది. ఇందులో కమల్‌హాసన్ సుప్రీం యాస్కిన్ పాత్రను పోషించగా, అమితాబ్ అశ్వత్థామ పాత్రలో కనిపించనున్నారు. వీరి కలయికతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. వీరిద్దరినీ ఒకే ఫ్రేమ్‌లో చూసేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రంలో దీపికా పదుకొనే, దిశా పటానీ కథానాయికలు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ నిర్మించారు.

అభిమానితో నాగ్ సెల్ఫీ



ఇటీవలే ముంబై ఎయిర్‌పోర్ట్‌లో ఓ అభిమాని నాగార్జునను కలిసేందుకు ప్రయత్నించగా, సెక్యూరిటీ సిబ్బంది అతన్ని పక్కకు నెట్టేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. విమర్శలు రావడంతో ఆ సంఘటనపై నాగార్జున విచారం వ్యక్తం చేశారు. ఆ అభిమానికి ఎక్స్ వేదికగా క్షమాపణలు చెప్పారు. బుధవారం నాగార్జున ఎయిర్‌పోర్ట్‌లో ఆ అభిమానిని కలిశారు. సెక్యూరిటీ సిబ్బంది పక్కకు నెట్టివేసిన సంఘటన ఆ రోజు తనకు తెలియదని అతనితో చెప్పారు. ఆ అభిమానిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నారు. అతనితో కొంత సమయం గడిపి, ఫొటోలు దిగారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. జరిగిన సంఘటన పట్ల మీ ప్రవర్తన హుందాగా ఉంది, 'మీరు రియల్ హీరో సార్' అంటూ నెటిజన్లు నాగార్జునను అభినందిస్తున్నారు.

ఈ తల్లి శాపం తగిలి తీరుతుంది

- ట్రోలర్స్‌పై మండిపడ్డ రేణూదేశాయ్



తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని మీమ్స్‌తో ట్రోల్ చేస్తున్నవారిపై నటుడు, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాజీ భార్య, నటి రేణూదేశాయ్ మండిపడ్డారు. ఏపీ ఎన్నికల్లో ఘన విజయం తర్వాత జనసేనాని పవన్ కల్యాణ్ తన శ్రీమతి అన్నా లెజినోవా, తనయుడు అకిరానందన్, కూతురు ఆద్యలతో దిగిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ ఫొటోను వాడుకొని కొందరు రేణూదేశాయ్ వ్యక్తిత్వాన్ని తక్కువ చేస్తూ రకరకాల మీమ్స్ రూపొందించారు. పవన్ కల్యాణ్‌తో విడాకులు తీసుకొని పొరపాటు చేశారనీ, అదృష్టాన్ని కాలదన్నుకున్నారనీ రకరకాల వ్యాఖ్యలతో మీమ్స్ పెడుతున్నారు. అవి తమను ఎంతగానో బాధపెడుతున్నాయని రేణూదేశాయ్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఆవేదన వ్యక్తం చేశారు. 'మనుషులు ఇంత దారుణంగా దిగజారడం సిగ్గు చేటు. నాపై వస్తున్న విమర్శలు, నన్నుఎగతాళి చేస్తున్న తీరు చూసి నా కూతురు ఆద్య కన్నీరు పెట్టుకుంది. మీమ్స్ చేసేవాళ్లంతా గుర్తుంచుకోండి, మీకూ ఓ కుటుంబం ఉంటుంది, తల్లులూ, అక్కచెల్లెళ్లు ఉన్నారు. మాపైన జోక్స్ చేస్తున్నవాళ్లకు ఈ తల్లి శాపం తగిలి తీరుతుంది. నా బిడ్డ కార్చిన కన్నీరు, ఊరకే పోదు. ఈ తల్లి శాపం తగిలితీరుతుంది. దీన్ని పోస్ట్ చేసేముందు వంద సార్లు ఆలోచించాల్సి వచ్చింది. కానీ తప్పలేదు' అని రేణూదేశాయ్ తన ఇన్‌స్టా పోస్ట్‌లో పేర్కొన్నారు.

అరుదైన గౌరవం



'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంతో ఆస్కార్ వేదికపై తెలుగు సినిమా సత్తా చాటారు దర్శక ధీరుడు రాజమౌళి. అంతే కాదు ఆ సినిమాతో ప్రపంచమంతా తన ప్రతిభకు తగిన గుర్తింపు పొందడంతో పాటు 'నాటు నాటు' పాటకు ఆస్కార్ సాధించారు. తాజాగా ఆస్కార్ అకాడెమీలో చేరేందుకు ఆహ్వానం అందుకొని అరుదైన గౌరవం పొందారు. 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రానికి కాస్ట్యూమ్స్ డిజైనర్‌గా పని చేసిన రమా రాజమౌళి కూడా ఈ గౌరవంలో భాగమయ్యారు. ఈ ఏడాది 57 దేశాల నుంచి మొత్తం 487 మంది కొత్త సభ్యులకు ఆస్కార్ అకాడెమీ ఆహ్వానం పంపింది. వీరిలో రాజమౌళి, రమతో పాటు భారతీయ చిత్ర పరిశ్రమ నుంచి షబానా అజ్మీ, రితేశ్ సిధ్వానీ, రవి వర్మన్, రీమా దాస్, ఆనంద్‌కుమార్ టక్కర్ , నిషా పహుజా, హేమల్ త్రివేది, గితేష్ పాండ్యా ఉన్నారు. ఒరిజినల్ సాంగ్ విభాగంలో 'నాటు నాటు ' పాటకు ఆస్కార్ అవార్డ్ సాధించిన 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం టీమ్‌లో జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్, కీరవాణి, చంద్రబోస్, సెంథిల్‌కుమార్, సాబు శిరిల్‌కు ఆస్కార్ అకాడెమీ కొత్త సభ్యులుగా గత ఏడాది ఆహ్వానం అందింది.

యాక్షన్‌ఎంటర్‌టైనర్



అల్లు శిరీష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'బడ్డీ'. గాయత్రి భరద్వాజ్, ప్రిషా రాజేశ్ సింగ్ హీరోయిన్లు. శామ్ ఆంటోన్ దర్శకత్వంలో జ్ఞానవేల్ రాజా, అధన జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం జులై 26న విడుదల కానుంది. మంగళవారం సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జ్ఞానవేల్ రాజా మాట్లాడుతూ 'నేను కథ కంటే శామ్‌నే ఎక్కువగా నమ్మాను. అల్లు శిరీష్ మా కుటుంబ సభ్యుడు. 'బడ్డీ'లో ఆయన నటన అందరినీ ఆకట్టుకుంటుంది' అని చెప్పారు. 'నేను రాజమౌళిగారి అభిమానిని. ఆయన తీసిన 'ఈగ' చిత్రం ఈ 'బడ్డీ'కి ప్రేరణ. సీజీ వర్క్ చేస్తున్నప్పుడు 'ఈగ' మూవీతో పోల్చి సజెషన్స్ ఇచ్చేవాడిని' అన్నారు దర్శకుడు శామ్. హీరో అల్లు శిరీష్ మాట్లాడుతూ 'ఇది కొత్త తరహా సినిమా ఇందులో హీరో నేను కాదు.. టెడ్డీ బేర్. ఆ క్యారెక్టర్‌కు ఇంప్రెస్ అయి ఈ సినిమా ఒప్పుకొన్నా. మా నాన్న కూడా నా మీద ఇంత ఖర్చు పెట్టి సినిమా తీయలేదు. భారీ ఖర్చుతో నాతో యాక్షన్ అడ్వెంచర్ తీసిన జ్ఞానవేల్ రాజాగారికి కృతజ్ఞతలు' అని చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/glCv1r4 లో చదవండి.

నేడు జిల్లా పరిషత్‌లో రేవులకు వేలం

గుంటూరు సిటీ, జూన్ 2: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని రేవులకు గురువారం జిల్లా పరిషత్‌లో వేలం జరగనున్నట్లు జడ్పీ సీఈఓ వసంత రాయుడు తెలిపారు. అచ్చంపేట మండలం చామర్రు, చింతపల్లి, గింజుపల్లి, తాడ్వాయి, మాదిపాడు, మాదిపాడు, మాచవరం మండలం గోవిందాపురంలలో పడవలు, బల్లకట్లు నడుపుకొనేందుకు, అమరావతి మండలంలోని దిడుగు, ధరణికోట, కొల్లిపర మండలం వల్లభాపురం రేవులకు గురువారం వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీల్డ్ టెండర్లు దాఖలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తామని సీఈఓ వెల్లడించారు.

కారంపూడిలో 9 డయేరియా కేసులు


వడియరాజుల కాలనీలో మెడికల్ క్యాంపు

కారంపూడి, జూన్ 26: స్థానిక వడియరాజుల వీధిలో తొమ్మిది డయేరియా కేసులు నమోదయ్యాయి. వీరిలో నలుగురిని నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. మిగతా ఐదుగురు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. బుధవారం వడియరాజుల కాలనీలో పీహెచ్‌సీ సిబ్బంది మెడికల్ క్యాంపు నిర్వహించారు. కాగా స్థానిక వడియరాజుల కాలనీలో విస్తరించిన డయేరియా వ్యాధి పూర్తిస్థాయిలో ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్ ఆదేశించారు.

సబ్‌జైలులో టీడీపీ నేతల పరామర్శ


బాధితులను పరామర్శించేందుకు సబ్‌జైలుకు వెళుతున్న కొమ్మాలపాటి

గుంటూరు, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఓట్ల లెక్కింపు రోజున జరిగిన ఘర్షణకు సంబంధించి అచ్చంపేట మండలం కొండూరు గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు గుంటూరు జిల్లా సబ్‌జైలులో రిమాండులో వున్నారు. వారిని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పల్నాడు జిల్లా అధ్య క్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి, అండగా వుంటామని హామీ ఇచ్చారు.

ధరల బోర్డు ఏర్పాటు నిబంధనలు పక్కాగా పాటించాలి

● చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు

గుంటూరు, జూన్ 26: దుకాణాల్లో వస్తువుల ధరల చిట్టా బోర్డు ఏర్పాటు నిబంధనలను పక్కాగా పాటించాలని ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు తెలిపారు. జిన్నాటవర్ సెంటర్‌లోని చాంబర్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయిల్, కిరాణా దుకాణాలు, రైస్ ఇతర ట్రేడర్స్ తమ దుకాణాల్లో ధరలు చిట్టాను ఏర్పాటు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా నాణ్యమైన వస్తువులతో పాటు కాటాలో జాగ్రత్తలు పాటించాలన్నారు. లేకుంటే అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. కలెక్టర్ సూచనల మేరకు వ్యాపారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.

ఉదయాన్నే... ప్రజాదర్బార్

అర్జీలు అందజేస్తున్న ప్రజలు ● అధైర్యపడొద్దు.. అండగా ఉంటానంటూ లోకేశ్ హామీ


దివ్యాంగులు , ఆశావర్కర్లు, రేషన్ డీలర్లు వినతి పత్రాలు స్వీకరిస్తున్న నారా లోకేశ్

తాడేపల్లి, జూన్ 26: రాష్ట్ర ఐటి శాఖమంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు అనూహ్య స్పందన లభిస్తోంది. ఉదయాన్నే ప్రజలు తమ సమస్యలు తెలుపుకునేందుకు అర్జీలతో ఉండవల్లి కరకట్ట వద్ద ఉన్న చంద్రబాబు నివాస గృహానికి బారులు తీరుతున్నారు. ప్రజాదర్బార్ గంటసేపు నిర్వహిస్తూ ముఖ్యంగా మంగళగిరి నియోజకవర్గ వాసులకే పరిమితమని చెబుతున్నప్పటికీ తమ సమస్యలు చెప్పుకుందామని రాష్ట్ర వ్యాప్తంగా ఆయా ప్రాంతాల నుంచి ప్రజలు విచ్చేస్తుండడం గమనార్హం. అయినప్పటికీ లోకేశ్ వారందరి సమస్యలు వింటూ అర్జీలు స్వీకరిస్తూ పరిష్కారమార్గం చూపుతుండడంతో అర్జీదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బుధవారం జరిగిన ప్రజా దర్బార్‌లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ పెదవడ్లపూడి సభ్యులు గౌరవ వేతనాలు పెంచాలని లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. తమకు రూ.3వేలు ఇస్తున్నారని రూ.5-10వేలు చేయాలని కోరారు. పాఠశాలల్లో అదనంగా రాగి జావ, కోడిగుడ్లు ఉడకబెట్టేందుకు ఎలాంటి అదనపు వేతనం ఇవ్వడం లేదని అందుకు అయ్యే గ్యాస్ కూడా తమ జీతం డబ్బుల నుండే ఖర్చు పెట్టుకుంటూ విద్యార్థులకు అందిస్తున్నామని వాపోయారు. జీతాలు కూడా సక్రమంగా అందడం లేదని పని ఒత్తిడి అధికంగా ఉందని చెప్పారు. లోకేశ్ వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులకు అందించే మెనూ ఏ విధంగా ఉండాలో చెప్పాలని మధ్యాహ్న భోజన కార్మికులను కోరారు. స్వర్ణకార చేతివృత్తిపై జీవనం సాగిస్తున్న తాను అనారోగ్యానికి గురై ఇంటికే పరిమితమయ్యాయని పెన్షన్ మంజూరు చేయించి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన బుట్టా పానకాలు కోరారు. విదేశాల్లో ఎంబీబీఎస్ చదువుతున్న తన కుమార్తెకు విదేశీ విద్యా పథకం ద్వారా ఆర్థిక సాయం చేయాలని ఉండవల్లికి చెందిన ఆలపాటి సురేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. మంగళగిరికి చెందిన ఆశావర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని తాడేపల్లికి చెందిన రేషన్ డీలర్లు తమ సమ్యలు పరిష్కరిం చాలని వినతిపత్రాలు అందించారు. డిగ్రీ చదివిన తనకు ఉద్యోగం కల్పించాలని మంగళగిరికి చెందిన కృష్ణచైతన్య అర్జీ అందించారు. అందరి సమస్యలు విన్న లోకేశ్ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

టీడీపీ వర్గీయులపై దాడి

● పలువురికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న టీడీపీ వర్గీయులు



వట్టిచెరుకూరు, జూలై26: మండలంలోని గారపాడు గ్రామ ఎస్సీ కాలనీలో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య ఆధిపత్య పోరులో దాడులు, ప్రతి దాడులు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి సమయంలో టీడీపీ వర్గీయులపై వైసీపీ శ్రేణులు జరిపిన దాడిలో పల్లపాటి రత్తయ్య, వీరయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. వారికి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించుకొని తిరిగి వస్తుండగా తెల్లవారుజాము నలుగు గంటల సమయంలో పథకం ప్రకారం గారపాడు గ్రామం, ఎస్సీ కాలనీ మధ్య రాడ్లు, కర్రలతో దాడి చేయగా పల్లపాడు ఏసుబాబు, విజయరావు, సుధీర్, అశోక్, మరియదాసు, కొర్రపాటి చిన్నాలకు గాయాలయ్యాయి. ఈ దాడిలో తమ కాలనీకి చెందిన వారితో పాటు సమీపంలో యామర్రు ఎస్సీ కాలనీకి చెందిన వారు పాల్గొన్నట్లు చెబుతున్నారు.గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ నాయకుల ప్రోద్బలంతో టీడీపీ నాయకులు, సానుభూతి పరులపై దాడులు జరుగుతున్నాయి. అయినా అరకొర పోలీస్ సిబ్బందితో పికెట్లు కొనసాగిస్తునే ఉన్నారు.

దాడుల ఘటనపై సీరియస్

గారపాడు ఎస్సీ కాలనీలో మంగళవారం రాత్రి, తెల్లవారుజామున జరిగిన ఘటనలపై స్థానిక ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులు తీవ్రంగా స్పందించారు. కాలనీలో జరుగుతున్న ఘటనలను తక్షణమే అరికట్టాలని, తిరిగి ఇలాంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ, డీఎస్పీ, సీఐలను ఆదేశించారు.

బాధితులకు పరామర్శ

వైసీపీ మూకల దాడిలో గాయపడిన బాధితులను జీజీహెచ్‌లో బుధవారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మండల నాయకులతో కలసి పరామర్శించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని జీజీహెచ్ సూపరిండెంట్‌కు సూచించారు. దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని పోలీస్ ఉన్నతాధికారులు, స్థానిక అధికారులకు సూచించినట్లు చెప్పారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ముఖ్యంగా ఎస్సీ కాలనీల్లో కక్షలు దాడులు పెరిగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఎంఎల్‌ఎస్ పాయింట్లను తనిఖీ చేసిన జేసీ

● తూకం ప్రకారం బియ్యం సరఫరా చేయాలని ఆదేశాలు ● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన


పాతగుంటూరులోని ఎంఎల్‌ఎస్ పాయింట్లలో స్టాకు పరిశీలిస్తున్న జేసీ రాజకుమారి

గుంటూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి స్టాక్ (ఎంఎల్‌ఎస్) పాయింట్లలో ఎలాంటి అవకతవకలు జరిగినా సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు చేపడతామని జాయింట్ కలెక్టర్ రాజకుమారి గణియా హెచ్చరించారు. ఈ నెల 25న 'ఆంధ్రజ్యోతి'లో 'అక్రమాలకు అడ్డా' అనే శీర్షికతో ఎంఎల్‌ఎస్ పాయింట్లలో జరుగుతోన్న అక్రమాలపై ప్రచురితమైన కథనానికి జాయింట్ కలెక్టర్ స్పందించి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక ఆర్‌టీసీ బస్టాండ్ వద్ద ఉన్న గుంటూరు అర్బన్, రూరల్ పాయింట్లను పరిశీలించారు. ఇక్కడి నుంచి వివిధ మండలాలలోని రేషన్ దుకాణాలకు తూకం ప్రకారం చౌక బియ్యం, ఐసీడీఎస్, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన సరుకులు ఏ విధంగా పంపిణీ చేస్తున్నారో పరిశీలించారు. ఎప్పటికప్పుడు వచ్చిన స్టాకు, పంపిణీ చేసే సరుకుల పరిమాణాలను, వచ్చిన తేదీని డిస్‌ప్లేలో చూపించాలని ఆదేశించారు. అనంతరం ఎంఎల్‌ఎస్ పాయింట్ల సమీపంలోని ఎల్‌పీజీ గ్యాస్ గోడౌన్‌ను సందర్శించి వారు ప్రతిరోజు ఏ విధంగా గ్యాస్ సిలిండర్లను ప్రజలకు పంపిణీ చేస్తున్నారో, వాటిని రిజిష్టర్లలో ఏ విధంగా నమోదు చేయుచున్నారో అని రిజిష్టర్లను తనిఖీ చేశారు. వినియోగదారులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే గ్యాస్ సిలిండర్లను విక్రయించాలని స్పష్టం చేశారు. అదనపు ఛార్జీలు వసూలు చేస్తే సిబ్బందిపై తీవ్రమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. అదేవిధంగా రెండు ఎంఎల్‌ఎస్ పాయింట్లు, గ్యాస్ గోడౌన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అక్కడి సిబ్బందిని హెచ్చరించారు.

వైసీపీ ఓటమి పాలైనా మిర్చి లారీలపై వారిదే పెత్తనం

● వారి ఆదేశాలు పాటించలేదని మూడు లారీల నిర్బంధం ● పెదకాకాని, నల్లపాడు పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేసిన బాధితులు

గుంటూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓటమి పాలైనా లారీ యూనియన్‌లో వారే శాసిస్తున్నారు. తాము నిర్ణయించిన కిరాయికే లారీని మిర్చి లోడింగ్‌కు పెట్టాలని హుకుం జారీ చేస్తున్నారు. వారి ఆదేశాలు పాటించకపోతే చట్టానికి విరుద్ధంగా లారీలను ఎక్కడికక్కడ అడ్డుకొని సీజ్ చేసి యూనియన్‌కు తరలిస్తున్నారు. తాజాగా బుధవారం వైసీపీ నేతలు మూడు మిర్చి లారీలను అడ్డుకోవడం వివాదంగా మారింది. దీనిపై బాధితులు నల్లపాడు, పెదకాకాని పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేశారు. అలానే టీడీపీ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. వేసవి సెలవుల అనంతరం మిర్చి ఎగుమతులు అరకొరగా ప్రారంభమయ్యాయి. బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతానికి లోడింగ్‌లు జరుగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా మదిర నుంచి కేవలం రూ. 1.40 లక్షల కిరాయికే లారీలను లోడింగ్‌కు పెడుతున్నారు. ఇక్కడ మాత్రం లారీ యూనియన్ రూ. 1.65 లక్షల కిరాయి నిర్ణయించింది. దీంతో అక్కడికి, ఇక్కడికి రూ. 25 వేల వ్యత్యాసం ఉండటంతో ఎక్స్‌పోర్టర్లు తటపటాయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముగ్గురు లారీ యజమానులను ఎక్స్‌పోర్టర్లతో నేరుగా మాట్లాడటంతో వారు రూ. 1.50 లక్షల కిరాయికి లోడింగ్‌లు పెట్టారు. ఈ విషయం తెలుసుకొన్ని యూనియన్‌లోని వైసీపీ వ్యక్తులు మూడు లారీలను అడ్డుకొని నిర్బంధించారు. అంతేకాకుండా రూ. 50 లక్షల విలువ కాగల లోడింగ్‌లున్న ఒక్కో లారీని వారి స్టాండ్‌కు తరలించారు. దీనిపై బాధితులు పెదకాకాని, నల్లపాడు పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టారు. అయితే బుధవారం సాయంత్రం వరకు లారీలను అడ్డుకొన్న వైసీపీకి చెందిన వ్యక్తులు, మరో రౌడీషీటర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. దీనిపై టీడీపీ ఎమ్మెల్యేలు జోక్యం చేసుకొని యూనియన్ గుత్తాధిపత్యాన్ని బద్ధలు చేయాలని లారీ యజమానులు కోరుతున్నారు.

సహకార సంఘాలు మరింత బలోపేతం

● రాష్ట్రంలో కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ద్వారా శిక్షణలు ● నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టి శ్రీనివాస్


మాట్లాడుతున్న నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాస్

గుంటూరు, జూన్ 26: కామన్ సర్వీస్ సెంటర్ పోర్టల్ ద్వారా సహకార సంఘాలు మరింత బలోపేతమవుతాయని తెలుగు రాష్ట్రాల నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టీ శ్రీనివాస్ పేర్కొన్నారు. కామన్ సర్వీసెస్ సెంటర్ పోర్టల్‌లో నమోదైన 1858 ప్రాథమిక సహకార సంఘాలకు శిక్షణలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు గుంటూరు బ్రాడీపేటలో బుధవారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరుగనున్న కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ జూలై 24 చివరికి రాష్ట్రంలో ఉమ్మడి 13 జిల్లాల్లోని 1858 ప్యాక్స్ శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాలను కేంద్ర మంత్రిత్వ శాఖ, రాష్ట్ర సహకార శాఖ పర్యవేక్షణలో నిర్వహించబడతాయని డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. ఈసిఎస్‌సి పోర్టల్ ద్వారా 300 రకాల సేవలు అందించడం వీలు పడుతుందని ఈ సేవలు అందించడం ద్వారా సహకార సంఘాల ఆర్థిక వనరులను పెంపొందించుకోవడానికి అవకాశాలు మెరుగుపడతాయని డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

వైసీపీ అరాచకాలపై కఠిన చర్యలు తీసుకోండి

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని ఆదేశం

గుంటూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో టీడీపీ శ్రేణులపై తెగపడుతున్న వైసీపీ ఆరాచకాలపై కఠినచర్యలు తీసుకోవాలని గుంటూరు ఎస్పీ తుషార్ డూడిని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం, గారపాడు ఎస్సీ కాలనీలో జరిగిన దాడులపై ఆయన తీవ్రంగా స్పందించారు. గ్రామాల్లో శాంతి భద్రతలు కాపాడుతూ, లాండ్ ఆర్డర్ ను అదుపు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీకి సూచించారు. మంగళవారం రాత్రి మూకుమ్మడిగా వైసీపీ వర్గాలు చేసిన దాడిలో ఏడుగురికి గాయాలు అయ్యాయన్నారు. తీవ్రంగా గాయాల పాలైన వారిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అధికారులు చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్‌ను పెమ్మసాని కోరారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

నకరికల్లు, జూన్ 26: అప్పుల బాధ తాళ లేక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకరికల్లు మండలం కుంకలగుంట గ్రా మానికి చెందిన వనిపెంట రామిరెడ్డి(43) కొంతకాలంగా అప్పులతో బాధ పడుతు న్నాడు. సుమారు మూడేళ్ల క్రితం కుమార్తెకు వివాహం చేశాడు. కుటుంబ అవసరాల తో పాటు వ్యవసాయ ఖర్చులు పెరిగి అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం కన్పించక మద్యానికి బానిసయ్యాడు. తీవ్ర మనస్థాపానికి గురైన రామిరెడ్డి ఈనెల 23వ తేదీ ఇంటి నుంచి వెళ్ళి పోయాడు. బుధవారం ఉదయం అటుగా పొలానికి వెళ్ళిన కొందరు విజయవారి బావిలో దుర్గంధం వస్తుందని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో నకరికల్లు ఎస్ఐ కె.నాగేంద్రరరావు, ఏఎస్ఐ, పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకున్నాడు. రామిరెడ్డి ఆ బావిలోకి వంగి ఉన్న ఓ చెట్టు కొమ్మకు ఉరి వేసుకొని చనిపోయి ఉండటాన్ని గుర్తించారు. ఎస్ఐ కె.నాగేంద్రరరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, కుమార్తెతో పాటు ఒక కుమారుడు ఉన్నారు.

మాదక ద్రవ్య రహిత సమాజం రావాలి

● ఆర్వీఆర్‌అండ్‌జేసీ కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ

గుంటూరు(విద్య), జూన్26: యువత మాదక ద్రవ్య రహిత సమాజం కోసం తమవంతు కృషి చేయాలని ఆర్వీఆర్ అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో ప్రపంచ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్లు ప్లకార్డులతో కళాశాలలో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. యువత మాదక ద్రావ్యా లకు బానిసలుగా మారితే సమాజం అనేక ప్రతికూల ప్రభావాలకు లోను అవుతుందన్నారు. వీటి నివారణ కోసం ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ నార్నె శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌డి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర పాల్గొన్నారు.

వజ్రోత్సవంలోకి అర్బన్ బ్యాంకు

● రూ.వెయ్యి కోట్ల టర్నోవర్ సాధించడమే లక్ష్యం ● ఛైర్మన్ బోనబోయిన


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస యాదవ్

గుంటూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ 74 వసంతాలను పూర్తి చేసుకొని వజ్రోత్సవంలోకి అడుగు పెట్టిందని బ్యాంకు మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ బోనబోయిన శ్రీనివాసయాదవ్ చెప్పారు. బుధవారం మధ్యాహ్నం బ్రాడీపేటలోని బ్యాంకు కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాలకవర్గ సభ్యులతో కలిసి బోనబోయిన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ, కార్పొరేట్ బ్యాంకులకు ధీటుగా రుణాలు, డిపాజిట్లపై అధిక వడ్డీలు ఇస్తూ పోటీ పడుతున్నామన్నారు. ఖాతాదారులకు అనుకూలంగా ఉండే విధంగా వడ్డీరేట్లు అమలు చేస్తున్నాం. ఎక్కడా లేని విధంగా బ్యాంకు షేర్ హోల్డర్స్‌కి 12 శాతం డివిడెండ్ ఇవ్వడం జరుగుతున్నదన్నారు. తాను 2016లో బ్యాంకు ఛైర్మన్ అయ్యేనాటికి రూ.500 కోట్ల వార్షిక టర్నోవర్ ఉంటే కరోనా లాంటి విపత్తుని కూడా ఎదుర్కొని నేడు దానిని రూ.800 కోట్లకు తీసుకెళ్లామన్నారు. ఈ సంవత్సరం ఆఖరుకు రూ.వెయ్యి కోట్ల టర్నోవర్‌ని ఖాతాదారుల సహకారంతో సాధిస్తామన్నారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ మర్రెడి బసివిరెడ్డి, డైరెక్టర్‌లు అర్తిమళ్ల వెంకటరత్నం, కాకాని రామారావు, బూసిరెడ్డి మల్లేశ్వరరావు, తట్టుకోళ్ల కేశవయ్య, ఈరేశం నరఏంద్రబాబు, బండా రవీంద్రనాథ్, షేక్ సైదా, నూతలపాటి వెంకటేశ్వర్లు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల షాపుల్లో తనిఖీలు

రూ.4,78,953 విలువైన విత్తనాల సీజ్


నాదెండ్లలో మిర్చి విత్తనాలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

నాదెండ్ల, జూన్ 26: మండలంలోని నాదెండ్ల గ్రామంతో పాటు యడ్లపాడు గ్రామాల్లో గల విత్తనాల షాపులను బుధవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఏపీ రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆదేశాల మేరకు గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో అధికారులు ఈ తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ అధికారులు స్థానిక వ్యవసాయ అధికారులతో కలసి రెండు షాపులను తనిఖీ చేశారు. నాదెండ్లలోని శ్రీ హర్ష సీడ్స్‌లో సోర్స్ సర్టిఫికెట్ లేకుండా అమ్ముతున్న రూ.47,250 విలువ హైబ్రీడు మిరప విత్తనాలను సీజ్ చేశారు. అదే విధంగా యడ్లపాడులోని శ్రీ సాయినాథ సీడ్స్ షాపులో అనుమతి లేకుండా అమ్ముతున్న రూ.4,31,703 విలువైన హైబ్రీడు మిరప విత్తనాలను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయ అధికారి కె.రమణ కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గంటసేపు లిఫ్ట్‌లో ఇరుక్కున్నారు..

● అల్లాడిన జడ్పీ ఉద్యోగులు ● పట్టించుకోని అధికారులు

గుంటూరు సిటీ, జూన్ 26: గుంటూరు జిల్లా పరిషత్‌లోని లిఫ్టు ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులకు చుక్కలు చూపిస్తోంది. బుధవారం ముగ్గురు ఉద్యోగులు లిఫ్టులో గంటసేపు ఇరుక్కుపోయి నరకం అనుభవించారు. సాధారణంగా ఉదయం ఉద్యోగులు విధు లకు హాజరయ్యే సమయంలో ఎక్కువ మంది మెట్ల మార్గం నుంచే మొదటి ఫ్లోర్‌కి చేరుకుంటారు. కొద్ది మాత్రం లిఫ్టును వినియోగిస్తారు. ఉదయం విధులకు హాజరైన జూనియర్ అసిస్టెంట్, అటెండర్, మరో ఉద్యోగి లిఫ్టులో ఎక్కారు. లిఫ్టు మధ్యలోకి వెళ్ళాక మొరాయించింది. టెక్నీషియన్ వచ్చేవరకు చాలా సమయం పట్టటంతో అందులో వున్న ఉద్యోగులు ఊపిరాడక అల్లాడిపోయారు. చివరకు తోటి ఉద్యోగులే ధైర్యం చేసి గేట్లు తెరిచి వారిని సురక్షితంగా బయటకు తెచ్చినట్లు తెలిసింది.

తరచుగా అంతే...

జిల్లా పరిషత్‌లోని లిఫ్టు 2012లో అప్పటి కలెక్టర్ విష్ణు చొరవతో ఏర్పాటు చేశారు. స్పందన కార్యక్రమం అప్పట్లో జడ్పీలోనే జరుగుతూ ఉండటంతో లిఫ్టు ఏర్పాటు చేయించారు. అప్పటి నుంచి వాడుతూ ఉండటంతో పూర్తిగా పాడైనట్లు చెబుతున్నారు. లిఫ్టు తరచుగా ఇబ్బంది పెడుతున్నా అధికారులు పెద్దగా పట్టించుకోవటం లేదు. సమావేశ మందిరంలో లైట్లు వెలగకపోయినా కూడా నిమ్మకు నీరెత్తినట్లు వుంటున్నారు.

వివాహిత హత్య


భవాని మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చిలకలూరిపేట, జూన్ 26: చిలకలూరిపేట మండలం పోతవరం గ్రామం లోని పొలాల్లో మేడా సాయి భవాని(20) అనే వివాహిత హత్యకు గురైంది. చిలకలూరిపేట రూరల్ పోలీసులు ఇందుకు సంబంధించి కేసు నమోదు చేశారు. పోలీసులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం నాదెండ్ల మండలం గణపవరంకు చెందిన పృథ్వీ అనే వ్యక్తిని భవానీ ఐదేళ్ల క్రితం వివాహం చేసుకుంది. ఏడాది కాలంగా వారి మధ్య మనస్పర్ధలు వచ్చి విడిగా ఉంటు న్నారు. సుమారు ఎనిమిది నెలల క్రితం ఆమెకు గతంలో పరిచయం ఉన్న కనపర్తి సురేష్ అనే వ్యక్తిని ఆమె వివాహం చేసుకుంది. ఐతే సుమారు నెల రోజుల నుంచి భవాని తన మొదటి భర్త పృథ్వీతో సన్నిహితంగా ఉంటున్న అనుమానంతో సురేష్ ఆమెతో గొడవ పడ్డాడు. ఆమెను ద్విచక్ర వాహనం పై ఎక్కించుకొని పోతవరం గ్రామ పొలాల్లోకి తీసుకు వెళ్ళి హత్య చేశాడు. మృతురాలు సోదరి మేడా స్వాతి ఇందుకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అడిషనల్ ఎస్పీ సీహెచ్ లక్ష్మీపతి ఇక్కడకు వచ్చి దర్యాప్తులో భాగంగా కేసును పరిశీలించారు. రూరల్ సీఐ పీ శ్రీనివాసరెడ్డి, పోలీసు బృందం నిందితుడి కోసం గాలిస్తున్నారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీనివాసరావు

మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా నేరం

● సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీనివాసరావు

● మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నేపథ్యంలో అవగాహన

గురజాలటౌన్, జూన్ 26: మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా నేరమని, ఈ కేసుల్లో నింధితులకు కఠిన శిక్షలు ఉంటాయని సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పల్లెగుంత మోడల్ స్కూల్లో బుధవారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన నాలుగవ అదనపు జిల్లా న్యాయాధికారి శరత్ మత్తు పదార్థాలకు బానిస అవడం వలనే కలిగే అనార్థాలను వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బండి వీరభద్రుడు, సీనియర్ న్యాయవాది షేక్ జానీ బాషా, ఎస్ఐ సౌందర్ రాజన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వాగ్దేవీ ఫార్మసీ కళాశాలలో సెబ్ సీఐ వెంకటరమణ ఆధ్వర్యాన మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ రవికుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, డైరెక్టర్ బడిదెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- న్యాయాధికారి శ్రీరాం శ్రీనివాస్ కల్యాణ్

మాచర్ల రూరల్ : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి శ్రీరాంశ్రీనివాస్ కల్యాణ్ అన్నారు. పట్టణంలోని ఎస్వీఆర్ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగం, దుష్ప్రభావాలు, నేరం - శిక్షలు వంటి అంశాలపై విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏజీపీ గొర్రె వెంకటేశ్వర్లు, న్యాయవాదులు గంగుల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సుబ్బారావు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీని సక్రమంగా అమలుచేయాలి

● జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాదు

నకరికల్లు, జూన్ 26: ప్రజా పంపిణీ వ్యవస్థను సక్రమంగా అమలు చేయాలని ఆయా గ్రామాల రెవెన్యూ అధికారులకు జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్‌ప్రసాదు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం నకరికల్లు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ వీఆర్‌వోలతో జేసీ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి నెల నిర్దేశించిన ప్రకారం నిత్యవసర సరుకుల పంపిణీ ఖచ్చితంగా ప్రజలకు చేరువవ్వాలని ఆదేశాలిచ్చారు. రేషన్ డీలర్ల వద్ద స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. రేషన్ డీలర్లు రాజీనామా చేసిన చోట రెవెన్యూ అధికారులు బాధ్యత తీసుకొని ప్రజా పంపిణీ వ్యవస్థ కొనసాగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఖాళీగావున్న రేషన్ డీలర్ షాపులను డ్వాక్రా గ్రూపుకు కేటాయించాలన్నారు. పౌర సరఫరాల్లో ఎక్కడా ఎలాంటి తేడాలు లేకుండా చూడాలన్నారు. రేషన్ డీలర్‌షిప్ వ్యవస్థలో తేడాలు వస్తే వీఆర్‌వోలు సైతం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో కార్యాలయ ఉద్యోగులు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

చేజర్లలో 'నేను బడికి పోతా..' ర్యాలీ

నకరికల్లు, జూన్ 26 : చేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం 'నేను బడికి పోతా..' ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫాహిం మాట్లాడుతూ.. బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండే విధంగా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని కోరారు.'బడికి పోదాం, భవితను మార్చుకుందాం, అందరూ చదువుదాం, అందరం ఎదుగుదాం, ఆడమగా తేడా వద్దు, అందరికీ చదువే ముద్దు, బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలి' అంటూ ర్యాలీలో విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో గేరా మోహనరావు, చెరుకూరి వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్‌వలి, ఏసీ హెచ్ వెంకటరావు, బత్తుల సుందరరావు, షేక్ గౌస్, పఠాన్ మాలిక్‌లు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పాఠశాలకు..

నకరికల్లు, జూన్ 26 : అంగన్ వాడీ కేంద్రాల్లో కోర్సు పూర్తి చేసుకున్న చిన్నారులు 50 మంది బుధవారం ప్రాథమిక పాఠశాలలో ప్రవేశం పొందారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో భాగంగా చల్లగుండ్లలోని ఏడు అంగన్ వాడీ కేంద్రాల నుంచి 50 మంది చిన్నారులను ప్రాథమిక పాఠశాలలో చేర్పించామన్నారు. ఇక మీదట కూడా ప్రతి ఏడాది అంగన్ వాడీ కేంద్రాల్లో పాఠశాల పూర్వ విద్య పూర్తి చేసిప్రతి ఎక్కువ మంది చిన్నారులు ప్రాథమిక పాఠశాలల్లో చేరేవిధంగా అంగన్ వాడీ కార్యకర్తలు పని చేయాలని ఆమె సూచించారు.



దేచవరంలో మహాలక్ష్మి గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణం

కమనీయం వేంకటేశ్వరుని కల్యాణం

నకరికల్లు, జూన్ 26 : మండలంలోని దేచవరం గ్రామంలో బుధవారం నిర్వహించిన మహాలక్ష్మి గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణం భక్తులను ఆనందపరవశులను చేసింది. 2వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలోని ప్రజలు స్వామిని దర్శించుకున్నారు. అర్చక స్వాములు స్వామి వారిని విశేషంగా అలంకరించారు. మహాలక్ష్మి గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

వైభవంగా గంగా పార్వతి సమేత మల్లేశ్వరుని కల్యాణం

మండలంలోని గుండ్లపల్లి గ్రామంలోని గంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం నిర్వహించిన కల్యాణం కన్నుల పండువగా సాగింది. 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని భక్తులు స్వామి వారిని దర్శించు కొని విశేషాభిషేకాలు చేశారు.

క్షేత్ర స్థాయిలో విధుల్లో ఉండాలి

● పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు

నకరికల్లు, జూన్ 26 : పశు సంవర్ధక శాఖలో పని చేస్తున్న ఉద్యోగులంతా ఉదయం 6 గంటల కల్లా క్షేత్ర స్థాయిలో విధుల్లో ఉండాలని నరసరావుపేట సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పీ.రామారావు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం నకరికల్లు ప్రాంతీయ పశు వైద్యశాలలో నకరికల్లు సబ్ డివిజన్ పరిధిలోని నకరికల్లు, రొంపిచర్ల మండలాలకు చెందిన ఆ శాఖా ఉద్యోగులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గేదెలకు గొంతు వాపు నివారణకు, గొర్రెల్లో నీలి నాలుక నివారణకు, ఆవుల్లో జబ్బ వాపు నివారణకు టీకాలను ఇస్తున్నట్టు తెలిపారు. అన్ని రకాల పశు సంతతికి ప్రభుత్వం అందిస్తున్న టీకాలను పూర్తి స్థాయిలో అందేలా ఉదయం 6 గంటలకే వైద్య సేవలు ప్రారంభం కావాలన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్‌సీహెచ్ నరసింహులు మాట్లాడుతూ ఇప్పటి వరకు పశుసంవర్ధకశాఖ సహాయకులుగా సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు పశు సంవర్ధక శాఖలోని వైద్యశాలలో ప్రత్యక్ష పద్ధతిలో వైద్య విధానాలపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఆగస్టు 15 వరకు ఈ శిక్షణ కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో నకరికల్లు ప్రాంతీయ వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బీ.వెంకటేశ్వర్లు నాయక్, వీఏఎస్‌లు, జేవీవోలు, ఎల్‌ఎస్‌ఏలు, వీఎల్‌వోలు, పశు సంవర్ధక శాఖ సహాయకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో ప్రాణాలకు ముప్పు

పిడుగురాళ్ల, జూన్ 26: యాంటీ డ్రగ్ డే సందర్భంగా బుధవారం సెబ్ పోలీసు అధికారులు పిడుగురాళ్ల జిల్లాపరిషత్ హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి అనంతరం మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాలతో కలిగే అనర్థాలు, మనిషి నాడీ వ్యవస్థ దెబ్బతినడంపై అవగాహన కల్పించారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు రవాణా చేసినా, కొనుగోలు చేసినా, ఉపయోగించినా చట్టరీత్యా కేసునమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీఐ పీవీ. ఆంజనేయులు, సెబ్ సీఐ సూర్యనారాయణ, ఎస్ఐ రబ్బానిఖాన్, సెబ్ ఎస్ఐ ప్రతాప్, పిడుగురాళ్ల పోలీసులు, హెచ్ఎం ధనలక్ష్మీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్ పునాదులపై గెస్ట్‌హౌస్ నిర్మాణం



అన్నక్యాంటీన్ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన కాంక్రీట్ పునాది

● వివిధ శాఖల్లో అవినీతిపై విజిలెన్స్ దర్యాప్తు చేపట్టండి..

● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డిని కోరిన టీడీపీ నేతలు

రెంటచింతల,జూన్ 26: అన్న క్యాంటిన్ పునాదులపై జడ్పీ గెస్ట్ హౌస్ నిర్మించారు.. దీంతో ఇప్పుడు అన్నక్యాంటిన్ నిర్మాణం ప్రశ్నార్థకంగా మారిందని టీడీపీ రెంటచింతల మండల నేతలు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డితో ప్రస్తావించారు. బుధవారం టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గొంటు సుమంత్‌రెడ్డిల నేతృత్వంలో పార్టీ నేతలు వెల్దుర్తి వెళ్లి ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2018లో మండల పరిషత్ కార్యాలయంలో రూ.1.80 లక్షలతో అన్న క్యాంటిన్ నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. అయితే 2019లో ప్రభుత్వం మారడంతో పనులు అర్థాంతరంగా ఆగిపోయాయన్నారు. అనంతరం అన్నక్యాంటీన్ పునాదులపై జడ్పీ గెస్ట్ హౌస్ నిర్మించారన్నారు. పేదలకు పట్టెడన్నం పెట్టే అన్న క్యాంటిన్ భవనం పునాదులపై వేరే నిర్మాణం చేపట్టడం సరైంది కాదని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డికి వివరించారు. అలాగే మండల పరిధిలో వివిధ శాఖల్లో జరిగిన అవినీతిపై విజిలెన్స్ విచారణ చేపట్టి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా సాగునీటి పనుల్లో అంతులేని అవినీతి జరిగిందని, గత ప్రభుత్వంలో జాబ్‌కార్డు ఇస్తే రూ.1000 తీసుకున్నారని ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డికి వివరించారు. ఈ విషయాలపై ఎమ్మెల్యే స్పందిస్తూ వైసీపీ ప్రభుత్వ హయాంలో జగిరిన అవకతవకలు కూటమి ప్రభుత్వ పాలనలో ఇక ఏమాత్రం సాగవని అన్నారు. గతంలో ప్రారంభించిన అన్నక్యాంటీన్ నిర్మాణ పునాదలపై గెస్ట్ హౌస్ నిర్మించడంపై ఆయన మండిపడ్డారు. అన్నక్యాంటీన్ల నిర్వహణపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుదని, ఆ మేరకు నియోజకవర్గంలో అన్న క్యాంటీన్ల నిర్మాణం, నిర్వహణను చేపడతామని ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రెంటచింతల అధ్యక్షుడు రాజారెడ్డి, బోడపాటి రామకృష్ణ, ప్రభురాజ్ యాదవ్, శౌరైడ్డి, రాయపరెడ్డి పాల్గొన్నారు.



అన్నక్యాంటీన్ కాంక్రీట్ పునాదిపై నిర్మించిన గెస్ట్‌హైస్ భవనం

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి



సమావేశంలో మాట్లాడుతునన ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ వెంకటేశ్వర్లు

● ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ వెంకటేశ్వర్లు

● పంచాయతీ, ఎఎన్ఎంలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమీక్ష

మాచవరం, జూన్26: ప్రస్తుత సీజన్‌లో వర్షాల కురుస్తుండటంతో కొత్త నీరు వచ్చి చేరుతుందని, దీనివలన ఏర్పడు నీటి కాలుష్యంతో అనేకరకాల వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని, ఆయా వ్యాధులపై పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, వైద్యశాఖ అధికారులు సంయుక్తంగా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ ఎన్. వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. బుధవారం మాచవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వీ. సురేష్ అధ్యక్షతన పంచాయతీ, ఏఎన్ఎంలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ మాట్లాడుతూ.. గ్రామాల్లో సీజనల్ వ్యాధులైన డయేరియా, మలేరియా, తదితర వ్యాధులు ఈ సీజన్‌లో ఎక్కువగా ప్రబలే అవకాశాలున్నాయన్నారు. ముందస్తు జాగ్రత్తలో భాగంగా గ్రామాలలోని ఓవర్‌హెడ్ ట్యాంకులు, మినీ వాటర్‌ట్యాంకులను బ్లీచింగ్‌తో శుభ్రపరచాలన్నారు. అదేవిధంగా మురుగు కాల్వల్లో తాగునీటి పైపులు లేకుండా చూడాలన్నారు. మురుగునీరు పారుదలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు మూడుశాఖల అధికారులు కలిసి గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకొని పరిష్కార మార్గాలు చూపాలన్నారు. సీజనల్ వ్యాధలపై ప్రతిరోజూ ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వారానికి ఒకసారి వీధుల వెంట బ్లీచింగ్, సున్నం చల్లించాలని, దోమల నివారణకు ఫాగింగ్ వంటి కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఈవోఆర్డీ వెంగళరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సురేష్, వైద్యాధికారి, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకాలతో

భూ రికార్డులు తారుమారు..

దాచేపల్లి, జూన్ 26: కొంత మంది వ్యక్తులు దాచేపల్లి తహసీల్దార్ గీతావాణి, జూనియర్ అసిస్టెంట్ భాస్కరరావుల సంతకాలను ఫోర్జరీ చేసి తప్పుడు రికార్డులు సృష్టించి బ్యాంక్‌ల నుంచి పంట రుణాలు పొందుతున్నట్లు తమకు సమాచారం తెలియవచ్చిందని దాచేపల్లి తహసీల్దార్ గీతావాణి స్పష్టం చేశారు. ఈ విషయంపై బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తహసీల్దార్, జూనియర్ అసిస్టెంట్‌తో పాటు కొంతమంది సర్వేయర్ల సంతకాలను కూడా ఫోర్జరీ చేస్తున్నట్లుగా అనుమానం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఫోర్జరీ బయటి వ్యక్తులు చేస్తున్నట్లుగా తమకు సమాచారం వచ్చిందని, ఈ మేరకు పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. తన సంతకాన్ని జూనియర్ అసిస్టెంట్ భాస్కరరావు ఫోర్జరీ చేసినట్లు వచ్చిన ప్రచారాన్ని ఆమె ఈ సందర్భంగా ఖండించారు. వాస్తవంగా జూనియర్ అసిస్టెంట్, తహసీల్దార్ సంతకాలను బయటి వ్యక్తులు ఫోర్జరీ చేసినట్లుగా గుర్తించినట్లు ఆమె తెలిపారు. ఈ విషయంపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు హెచ్చరించారు.

పార్లమెంటరీ స్థాయి నేతగా

ఎంపీ లావు నియామకంపై హర్షం

కారంపూడి, జూన్ 26: టీడీపీ పార్లమెంటరీ స్థాయి నేతగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు నియామకంపై లావు యూత్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు చిరుమామిళ్ల శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అభివృద్ధి పనులు చేపడతారన్నారు. వారు వరికపూడిశెల ప్రాజెక్ట్ నిర్మించి పల్నాడు ప్రాంత ప్రజలకు మేలు చేస్తారన్నారు. రాష్ట్ర రాజధానిగా అమరావతి పేరు ప్రఖ్యాతలు పొందబోతోందన్నారు. శ్రీనివాసరావు ఆకాంక్షించారు.

వ్యవసాయానికి ఉపాధిని వర్తింప చేయాలి

రెంటచింతల,జూన్ 26 : రైతులకు వ్యవసాయం గిట్టుబాటు కాకపోడం, కూలీల కొరత దృష్ట్యా వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని వర్తింపచేయాలని టీడీపీ రైతు విభాగం పార్లమెంట్ కార్యదర్శి చేరైడ్డి కృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకుపోతామన్నారు. గత ప్రభుత్వం రైతులను విస్మరించి మూల్యం చెల్లించుకోవడంతోనే 11 ఎమ్మెల్యే సీట్లకు పరిమితమై ప్రతిపక్ష హోదా సైతం కోల్పోయిందన్నారు. సీఎం చంద్రబాబు ఈ విషయంలో ఉదారంగా వ్యవహరించాలని కోరారు.

వినతి పత్రం అందజేత

సత్తెనపల్లి, జూన్ 26 : ఎన్ఎస్‌పీ కెనాల్స్ ఎంప్లాయిస్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ, పీడబ్ల్యుడీ వర్క్ షాపు అండ్ కెనాల్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు బుధవారం ఎన్ఎస్‌పీ ఈఈకి వినతి పత్రం అందించారు. నాగార్జున సాగర్ రైట్ కెనాల్స్ పరిధిలో పని చేస్తున్న లస్కర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితర సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరారు. వారిలో కంభాల శ్రీనివాస్, డీఆర్ మస్తాన్, నగేష్ తదితరులు ఉన్నారు.



పార్టీ నేతలతో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి

ఆ ఐదు సంతకాలతో ప్రజలు సంతోషం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

పెదకూరపాడు, జూన్ 26 : సీఎం చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం అనంతరం చేసిన సంతకాలతో ప్రజల్లో నమ్మకాన్ని, ఆనందాన్ని కలిగించాయని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. గుంటూరులోని కార్యాలయంలో పార్టీ నేతలతో కలసి ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీతో నిరుద్యోగుల ఆశలను నెరవేర్చటమే ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించిందన్నారు. పెన్షన్‌ను రూ. 4 వేలకు పెంచి పింఛన్‌దారులకు భరోసానిచ్చిందన్నారు. విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీయటం కోసం, సేవా రంగం అభివృద్ధి కోసం స్కిల్ సైన్సెస్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రజలను తమ బిడ్డలుగా, రాష్ట్రాన్ని కుటుంబంగా చంద్రబాబు భావించారన్నారు. సమావేశంలో టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మద్దిరాల గంగాధర్, టీడీపీ నేతలు కొండూరు భాగేశ్వరరావు, వీరబాబు, రవి, కిషోర్, దిలీప్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటీస్ లేని డీఎస్సీ ప్రకటించాలి

రెంటచింతల,జూన్ 26 : నూతన ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో అప్రెంటీస్ విధానం లేకుండా నోటిఫికేషన్ విడుదల చేయాలని యూటీఎఫ్ గౌరవాధ్యక్షులు డాక్టర్ చిన్నమ్మ, ఎస్టీయు అధ్యక్షుడు లేళ్ల శ్రీనివాసరావులు బుధవారం వేర్వేరు ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. పాలనపరంగా అనుభవజ్ఞులైన చంద్రబాబు ఈ విషయంలో చొరవ చూపాలని వారు కోరారు.

అనధికార వెంచర్లపై చర్యలు తీసుకోండి

● కలెక్టరుకు గ్రామస్థుల ఫిర్యాదు

పిడుగురాళ్ల, జూన్ 26: బ్రాహ్మణపల్లి, తుమ్మలచెరువు, కామేపల్లి, పిడుగురాళ్ల సమీపాలలో కొన్నేళ్లుగా ఇబ్బడిముబ్బడిగా ఎటువంటి అనుమతులు లేకుండా వెలసిన వెంచర్లపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని నరసరావుపేట జిల్లా కలెక్టర్‌కు బుధవారం గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. పంచాయతీ తీర్మానం, ల్యాండ్ కన్వర్షన్ చేయకుండానే వెంచర్లు వేయడమే కాకుండా ప్లాట్లుగా విభజించి విక్రయించడం, సిమెంట్ రోడ్లు వేయడం, విద్యుత్ ఏర్పాటు చేయడం చేశారన్నారు. ఈ విషయంపై దిగువస్థాయి అధికారుల నుంచి పూర్తి స్థాయి నివేదికలు తెప్పించుకొని తగు చర్యలు తీసుకుంటూ గ్రామ పంచాయతీలకు ఆదాయం పెరిగేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి..

● విద్యార్థులతో పెదకూరపాడు సీఐ మంగారావు

క్రోసూరు, జూన్ 26 : విద్యార్థులందరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి భవిష్యత్‌ను బంగారు బాటగా తీర్చిదిద్దు కోవాలని పెదకూరపాడు సీఐ మంగారావు అన్నారు. బుధవారం క్రోసూరులోని జైభారత్ టెక్నోస్కూల్లో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచార వారోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు అవగాహన నిమిత్తం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదక ద్రవ్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉన్నతమైన భవిష్యత్‌ను ఆశించే విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. మత్తు పదార్థాల వినియోగం ప్రాణాంతకమేక కాక నార్కోటిక్ డ్రగ్స్ ఎన్‌డీపీఎస్ చట్ట ప్రకారం తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుందని, భారీ జరిమానాలు, కఠిన మైన శిక్షలు ఉంటాయన్నారు. నూనూగు మీసాల యువకులు కూడా మత్తు పదార్దాలకు బానిసలు కావటం బాధాకరం అన్నారు. తెలిసో తెలియకో ఒక్కసారి మత్తు పదార్దాలకు బానిసలైతే బాల్యంతో పాటు భవిష్యత్ నాశన మవుతుందన్నారు. మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ ఫ్రీ సూపర్ హీరో సెల్ఫీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో క్రోసూరు ఎస్ఐ మహమ్మద్ షఫీతో పాటు పాఠశాల డైరెక్టర్ తిప్పిరెడ్డి జయనేంద్రారెడ్డి, హెచ్ఎం షేక్ కదీర్, తిరుపతి స్వామి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెదకూరపాడు సీఐ మంగారావు

పీడ వదిలింది ..

● మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అరెస్టుతో ప్రజల హర్షం

● బాణాసంచా పేల్చి.. కేక్‌లు కట్ చేసి సంబరాలు

● ఆనందాన్ని వ్యక్తం చేసిన పిన్నెల్లి బాధితులు

మాచర్లటౌన్, జూన్ 26: మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టుతో పీడ వదిలిపోయిందని నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పిన్నెల్లి సోదరుల బాధిఉలు బాణాసంచా కాల్చి గులాంలు చల్లుకొని కేక్‌లు కట్ చేసి సంబరాల్లో మునిగితేలారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకొని ఆనందం వ్యక్తం చేశారు. వారి ఆనందం వారి మాటల్లో..

అన్యాయంగా మానాన్నను చంపించారు

- తోట వీరాంజనేయులు, గుండ్లపాడు, వెల్దుర్తి మండలం



మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు వారి రౌడీ మూకలతో మా నాన్న తోట చంద్రయ్యను గ్రామ నడిబొడ్డున దారుణంగా హత్య చేయించారు. దుర్మార్గుడైన రామకృష్ణారెడ్డి అరెస్ట్ అవడం ఆనందంగా ఉంది. అతని తమ్ముడు వెంకట్రామిరెడ్డిని కూడా పోలీసులు వెంటనే అరెస్ట్ చేయాలి. మాచర్ల నియోజకవర్గంలో పిన్నెల్లి సోదరులు బీసీలపై దాడులు చేయించారు.

మాచర్లకు స్వాతంత్ర్యం వచ్చింది

- బాణావత్ వెంకటేశ్వరనాయక్, కేపీగూడెం, వెల్దుర్తి మండలం



మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్ట్‌తో మాచర్ల నియోజకవర్గంకు స్వాతంత్ర్యం వచ్చింది. నాపై అక్రమంగా కేసు పెట్టి హింసించారు. పోలీసులు నన్ను శిరిగిరిపాడు అడవుల్లోకి తీసుకెళ్లి కొట్టారు. పోలీసులు నన్ను కొట్టేటప్పుడు పిన్నెల్లి సోదరులకు వీడియో కాల్ చేసి చూపించారు. డబ్బు, అధికార మదంతో ఎస్సీ, ఎస్టీలను వేధించారు. చివరికి న్యాయం గెలించిందంటూ ఆనందం వ్యక్తం చేశారు.

అరాచకానికి చెల్లుచీటి

- నంబూరు శేషిగిరిరావు, పాలువాయిగేటు, రెంటచింతల మండలం



మాచర్ల నియోజకవర్గంలో అరాచకానికి చెల్లు చీటి పలికారు. ప్రజాస్వామ్యం రానున్న రోజుల్లో వేళ్లూనుకుంటుంది. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్ట్ ఇందుకు నిదర్శనం. ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న వ్యక్తి మే 13న పోలింగ్ రోజున బూత్‌ల్లోకి చొరపడడం, ఈవీఎం ధ్వంసం చేసిన తీరుకు ప్రజాస్వామ్యం సిగ్గుపడింది. అడ్డుకోబోయిన తనపై మారణాయుదాలతో దాడి చేయడం దేనికి సంకేతం. బ్రహ్మారెడ్డి గెలుపుతో మాచర్లకు మంచి రోజులు వచ్చాయి. ఎక్కడా ఘర్షణలు జరిగే అవకాశం లేదు.

న్యాయం గెలిచింది

- గుమ్మా వెంకటేశ్వర్లు, జంగమహేశ్వరపాడు, దుర్గి మండలం



ప్రజలకు అండగా ఉండాల్సిన ప్రజాప్రతినిధి అవినీతి పరులకు కొమ్ము కాస్తూ ఎన్నో ఇబ్బందులకు గురి చేశారు. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్ట్ ఆనందంగా ఉంది. న్యాయం గెలిచింది. మా గ్రామంలోని వంద కుటుంబాలను ఐదేళ్లుగా ఊర్లో లేకుండా ఇబ్బందులకు గురి చేశారు. నిందితులను శిక్షించకుండా బాధితులపై కేసు పెట్టిన చరిత్ర హీనుడుగా రామకృష్ణారెడ్డి నిలిచిపోతారు.

కారంపూడిలో.. కారంపూడి పట్టణంలోని సినిమాహాలు, ఇందిరా గాంధీ బొమ్మ సెంటర్లో ప్రజలు బాణాసంచాలు పేల్చారు. కేక్ కట్ చేశారు. ఐదేళ్ల పాటు ఎటువంటి తప్పులు చేయకున్నా అక్రమ కేసులు పెట్టి జైలు పాలు చేసిన రామకృష్ణారెడ్డికి సరైన శిక్ష పడిందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య మాట్లాడుతూ తాను శబరిమలలో ఉంటే తనపై అక్రమ కేసు పెట్టి జైలుకు పంపారన్నారు. బీసీ సెల్ కన్వీనర్ గోరంట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ ఇన్‌చార్జిగా బ్రహ్మారెడ్డి కారంపూడి వచ్చినప్పుడు వారికి భోజన వసతి కల్పించినందుకు అప్పటి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తన మనుషులతో దాడి చేయించారన్నారు. పోలీస్‌స్టేషన్లో సైతం నాపై దాడి చేశారన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ మాట్లాడుతూ వైసీపీ ఎస్సీ వర్గానికి ఓ కార్యకర్త చొక్కా చించుకొని తనపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టి రెండు నెలలపాటు జైలులో ఉంచారన్నారు. తప్పుడు కేసులు పెట్టడమే కాకుండా టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణను వైసీపీ వర్గీయులు దాడి చేసి గాయపరిచారు. రామకృష్ణారెడ్డి తమ్ముడు వెంకట్రామిరెడ్డిని అరెస్ట్ చేసి శిక్ష పడేలా చేయాలని టీడీపీ నేతలు చప్పిడి రాము, తోట నరసింహారావు, పూర్ణయ్య పూర్ణచంద్రరావు, సాంబశివరావు కోరారు.

సీపీఎస్ ఉద్యోగులపై కేసులు ఎత్తి వేయించాలి

● మంత్రి లోకేశ్‌ను కోరిన సీపీఎస్ ఉద్యోగుల సంఘం నేత పిచ్చయ్య

క్రోసూరు, జూన్ 26 : గత ప్రభుత్వంలో సీపీఎస్ రద్దు కోసం ప్రదర్శనలు, ధర్నాలు వంటివి చేసిన సందర్భంలో అప్పటి ప్రభుత్వం తమ పై అనేక కేసులు బనాయించిందని, టీడీపీ ప్రభుత్వం ఆ కేసులన్నింటినీ ఎత్తి వేయించాలని పల్నాడు జిల్లా సీపీఎస్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి పోలూరి పిచ్చయ్య కోరారు. ఈ మేరకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలసి ఆయన వినతి పత్రం సమర్పించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంపై తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని, దీని గురించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని లోకేశ్ తమకు హామి ఇచ్చినట్టు ఆయన తెలియ జేశారు.

కౌలు కార్డులతో ఎన్నో ప్రయోజనాలు

క్రోసూరు, జూన్ 26: కౌలు రైతులకు ప్రభుత్వ ప్రయోజనాలు అందజేసేందుకే వారికి గుర్తింపు కార్డులను అందజేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్ అన్నారు. బుధవారం హసనాబాద్, నాగవరం గ్రామాల్లో గుర్తింపు కార్డులపై కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కౌలు గుర్తిపు కార్డులు పొందటం ద్వారా అనేక పథకాలు, సబ్సిడీలు, యంత్ర పరికరాలు పొదవచ్చని సూచించారు. కౌలు రైతులందరూ తప్పనిసరిగా తగిన ధ్రువీకరణ పత్రాలతో రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే గుర్తింపు కార్డులు ఇస్తారని ఆయన సూచించారు.



కన్నా నాగరాజు పుట్టిన రోజు సందర్భంగా వృద్ధులకు రొట్టెలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఘనంగా కన్నా నాగరాజు జన్మదిన వేడుకలు

సత్తెనపల్లి, జూన్ 26 : గుంటూరు మాజీ మేయర్, టీడీపీ నేత కన్నా నాగరాజు పుట్టిన రోజు వేడుకలను బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. 18వ వార్డు టీడీపీ అధ్యక్షుడు షేక్ నాగుల్ ఆధ్వర్యంలో, గుజ్జర్లపూడి స్టాలిన్ ఆధ్వర్యంలో, టీడీపీ ప్రజా వేదికలో ఘనంగా నిర్వహించారు. నాగన్నకుంటలో టీడీపీ నేతలు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మొల్లమాంబ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎలినీడి రామ స్వామి, సయ్యద్ పెద కరిముల్లా, నూర్ బాషా జానీ బాబు, తోట అంబిక, సంధ్య, మల్లేశ్వరి పాల్గొన్నారు.

రాజుపాలెం: మండలంలోని పలు గ్రామాలలో కన్నా నాగరాజు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజుపాలెం టీడీపీ కార్యాలయంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు జంగం రాజా, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు తోట నరసయ్య, తదితరులు కట్ చేసి పలువురికి పంచిపెట్టారు.

పల్నాడు వార్తలు

నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

20మంది రేషన్ డీలర్ల రాజీనామా

యడ్లపాడు, జూన్ 26 : మండలంలోని పలు గ్రామాలకు చెందిన 20 మంది రేషన్ డీలర్లు రాజీనామా చేశారు. మండలంలో మొత్తం 39 రేషన్ దుకాణాలు ఉండగా 90శాతం దుకాణాలు డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చాక గతంలో ఉన్నవారిని తొలగించి వైసీపీ కార్యకర్తలకు అప్పగించారు. ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో వారు చేసిన అక్రమాలు వెలుగు చూస్తాయన్న భయంతో తమ డీలరు పదవులకు రాజీనామాలు చేస్తున్నారు. బుధవారం ఒక్కరోజే 20 మంది రాజీనామాలు చేయడం విశేషం. రేషన్ డీలర్లు పెద్దసంఖ్యలో రాజీనామా చేయడంతో పాటు కొత్త డీలర్ల నియామకం జరిగే వరకు నిత్యావసర సరుకుల పంపిణీ బాధ్యతను రెవెన్యూ, గ్రామసచివాలయ ఉద్యోగులకు అప్పగించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

కొండపాటూరులో మొక్కు తీర్చుకున్న టీడీపీ నాయకులు

చిలకలూరిపేట, జూన్ 26 : కొండపాటూరులో ఉన్న పోలేరమ్మ తల్లి దేవస్థానం వద్దకు వెళ్లి బుధవారం స్థానిక టీడీపీ నాయకులు మొక్కు తీర్చుకున్నారు. టీడీపీ అధికారంలోకి రావాలని, చిలకలూరిపేటలో ప్రత్తిపాటి పుల్లారావు విజయం సాధించాలని వారు మొక్కుకున్నారు. రాష్ట్రంలో టీడీపీకి అత్యధిక సీట్లు ఇవ్వటంతో పాటు ప్రత్తిపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించటం ఎంతో ఆనందంగా ఉందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు జంగా వినాయకరావు, అబ్దుల్ కుమీర్, బెజ్జం రవి, కుప్పాల అనంతయ్య, పీటర్ తదితరులు పాల్గొని మొక్కు తీర్చుకున్నారు.

సాహు మహారాజ్ 150వ జయంతి వేడుకలు



చత్రపతి సాహు మహారాజ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

వినుకొండ, జూన్ 26: రిజర్వేషన్ల పితామహుడు, తొలి బహుజన చక్రవర్తి చత్రపతి సాహు మహారాజ్ 150వ జయంతి వేడుకలను స్థానిక బీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా చత్రపతి సాహు మహారాజ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఎస్పీ సీనియర్ నాయకులు రాంబాబు మాట్లాడుతూ కొల్హాపూర్ సంస్థానంలో అప్పటి పరిస్థితుల్లో మార్పు కోసం రిజర్వేషన్లు అమలు చేసిన గొప్ప సంస్కరణలకు బీజం వేసిన గొప్ప నాయకులని కొనియాడారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ సాహు మహారాజ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో భారత రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ప్రజలకు రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు. వినుకొండ ఇన్‌చార్జి మాసిపోగు ఏసోబు మాట్లాడుతూ చత్రపతి సాహు మహారాజ్‌గారి ఆశయాలను బహుజన సమాజ్ పార్టీ నెరవేరుస్తుందని తెలిపారు కార్యక్రమంలో పల్నాడు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కంభంపాటి నాగవంశీ, సంగం శ్రీకాంత్ రెడ్డి, ఏనుబరి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన బోజనాన్ని అందించాలి

● శావల్యాపురం ఎంఈవో-2 లలితాకుమారి

ఇర్లపాడు(శావల్యాపురం), జూన్ 26: మధ్యాహ్న బోజన పథకంలో ఎండీఎం ఆపరేటర్లు ప్రభుత్వ మెనూను పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన బోజనాన్ని అందించాలని ఎంఈవో-2 పుసులూరి లలితాకుమారి అన్నారు. మండలంలోని ఇర్లపాడు ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న మధ్యాహ్న బోజన పథకాన్ని బుధవారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులతో కలసి బోజనం చేసి వంటకాల రుచి, నాణ్యతను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఎంఈవో మాట్లాడుతూ గతంలో పనిచేసిన ఎండీఎం ఆపరేటర్ విధులకు హాజరు కాకపోతుండడంతో గ్రామస్థుల ఫిర్యాదు మేరకు తాత్కాలికంగా మరొకరిని ఎండీఎం ఆపరేటరుగా నియమించామన్నారు. వంటకు నాణ్యమైన సరుకులను వాడాలని, విద్యార్థులకు క్రమం తప్పకుండా కోడిగుడ్డు, చిక్కీలను అందించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎండీఎం ఆపరేటర్‌కు సూచించారు. మధ్యాహ్న బోజనాన్ని నిరంతరం పర్యవేక్షించాలని హెచ్‌ఎం వల్లభ శ్రీనివాసరావుకు సూచించారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సీఆర్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హిపాటోబిలియరి సర్జరీలో అన్నవరం వాసికి పట్టా

రొంపిచర్ల, జూన్ 26: మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన డాక్టర్ వేమూరి ప్రసన్న కుమార్ న్యూఢిల్లీలోని ప్రఖ్యాత సర్ గంగారామ్ హాస్పిటల్ నుంచి హిపాటోబిలియరి సర్జరీలో డిగ్రీని బుధవారం అందుకున్నారు. ఈ సర్జరీకి పితామహుడిగా పేరు గాంచిన డాక్టర్ సమీరన్ నుంచి పట్టా పొందారు. మెంటార్షిప్‌లో ప్రసన్నకుమార్ అపూర్వమైన నైపుణ్యాన్ని సంపాదించారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ, హిపాటోబిలియరీ సర్జరీలో ఒక ఆశాజనకమైన కెరియర్ ఆరంభాన్ని సూచిస్తుందన్నారు. రోగులకు మెరుగైనసేవలు అందిస్తానని ప్రసన్నకుమార్ తెలిపారు. అన్నవరంలో వేమూరి శ్రీనివాసరావు, మౌనికల కుమారుడు డాక్టర్ ప్రసన్నకుమార్. అతడి సోదరుడు నరేంద్రబాబు వైద్యుడిగా ఉన్నారు. డాక్టర్ పట్టా పొందటంపై గ్రామస్థులు, తల్లిదండ్రులు ఆయనకు అభినందనలు తెలిపారు.

మున్సిపల్ వర్కర్ల నూతన కార్యవర్గం ఎన్నిక

చిలకలూరిపేట, జూన్ 26 : ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ వర్కర్ల సంఘం చిలకలూరిపేట శాఖ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఇక్కడ ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా వేల్పుల అంజయ్య, సభ్యులుగా వీ దేవ సహాయం, వై నారాయణ, ఏ పోతురాజు, వీ శివయ్య, గంగాధర్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ ఇన్‌చార్జ్ ఏరియా కార్యదర్శి నాగభైరు రామ సుబ్బాయమ్మ మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులు సంఘటితంగా మెలగి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. అధికారులు వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. శాశ్వత పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికుల జీపీఎఫ్ ఖాతాలు అప్‌డేట్ చేయాలని కోరారు. అండర్ గ్రౌండ్ డ్రైయినేజ్ వర్కర్లు విధి నిర్వాహణలో మరణిస్తే రూ 30 లక్షలు, ప్రమాదంలో గాయ పడితే రూ 10 లక్షలు చెల్లించాలని కోరారు. ఎన్ని సార్లు అడిగినా కార్మికులకు పనిముట్లు ఇవ్వటం లేదని, కొత్త పుష్‌కార్టులు కూడా ఇవ్వాలని అడుగు తుంటే పట్టించు కోవటం లేదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు పేలూరి రామారావు, దాసరి వరహాలు, తాళ్ళూరి బాబూరావు, చెరుకుపల్లి నిర్మల, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రవీంద్రను కలసిన గోనుగుంట్ల



కొల్లు రవీంద్రతో గోనుగుంట్ల కోటేశ్వరరావు

రొంపిచర్ల, జూన్ 26 : రొంపిచర్లకు చెందిన దివ్యాంగుల వయో వృద్ధుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్ర గనుల ఎక్సైజ్ శాఖామాత్యులు కొల్లు రవీంద్రను బుధవారం కలిశారు. వెలగపూడి సచివాలయంలో ఆయనను కలసి పుష్ప గుచ్ఛం అందజేశారు. రాష్ట్ర అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న డాక్టర్ కోడెల శివరామకృష్ణ

రొంపిచర్ల, జూన్ 26 : మండలంలోని గోగులపాడు గ్రామంలో ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయ వార్షికోత్సవం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారిని డాక్టర్ కోడెల శివరామకృష్ణ దర్శించుకున్నారు. కల్యాణోత్సవంలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు శివరామకృష్ణకు తీర్థ ప్రసా దాలను అందజేశారు. కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో తాగునీటి చెరువులు నింపాలి

● వినుకొండకు రూ.159 కోట్లతో శాశ్వత మంచినీటి పథకం పనులు

● సింగర్ చెరువుతో పాటు ఫిల్టర్ బెడ్ల పరిశీలన

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



వినుకొండ పట్టణానికి నీటిని సరఫరా చేసే ఫిల్టర్ బెడ్లను పరిశీలిస్తున్న జీవీ, మక్కెన, అధికారులు

వినుకొండటౌన్, జూన్ 25: పల్నాడు జిల్లాలోని తాగునీటి చెరువులను సాగర్ జలాలతో నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. పట్టణానికి తాగునీరు సరఫరా చేసే సింగర్ చెరువుతో పాటు, ఫిల్టర్ బెడ్లను మున్సిపల్ అధికారులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో పాటు ఎన్డీఏ కూటమి అభ్యర్థులు నాగశ్రీను, నిశంకర శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బుధవారం పరిశీలించారు. చెరువులో నీరు అడుగంటడంతో పాటు, ఏపుగా పెరిగిన జమ్మును చూసిన ఆయన గత పాలకుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువుకు మరమ్మతుల పేరుతో లక్షలు దండుకున్నారని, టెండర్ల ద్వారా చేపట్టాల్సిన పనులను వ్యక్తిగతంగా చేపట్టడం ద్వారా ప్రజల సొమ్ము వృధా అయిందన్నారు. రానున్న రోజుల్లో సుమారు 159 కోట్ల రూపాయలతో పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన మంచి నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం చెరువులో కేవలం 15 రోజులకు మించి, నీరు సరఫరా అయ్యే పరిస్థితి లేదని గమనించిన జీవీ వెంటనే రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో ఫోన్ ద్వారా సంప్రదించారు. కృష్ణ రివర్ బోర్డుతో సంప్రదించి పల్నాడు జిల్లాలోని తాగునీటి చెరువులకు నీటిని విడుదల చేయాలని కోరారు. అధికారులతో సంప్రదించి నీటి విడుదలకు చర్యలు తీసుకుంటామని మంత్రి రామానాయుడు హామీ ఇచ్చారు. నీటి విడుదల సమయానికి రెండో చెరువులో పూడిక తొలగింపు పనులు చేపట్టి నీటి నిల్వ సామర్థ్యం పెంచాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణితో పాటు, డీఈఈ వెంకయ్యను ఆదేశించారు. ప్రస్తుతం ఫిల్టర్ బెడ్లు శుభ్రం చేయాలని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని విడుదల చేయాలని, నీటిశుద్ధి కర్మాగారం వద్ద వాటర్ లీకేజీని అరికట్టాలని చెప్పారు. ఒక్కరోజు నీటి సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేపట్టి, నీటిని సరఫరా చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం హయాంలో మంజూరైన మంచినీటి పథకం పనులు పూర్తి చేయడంలో గత పాలకులు పూర్తిగా విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం వాటాగా చెల్లించాల్సిన 30శాతం మ్యాచింగ్ గ్రాంట్ చెల్లించి ఉంటే, 70శాతం కేంద్ర ప్రభుత్వం నిధులు విడదల చేసి మంచినీటి పథకం పనులు పూర్తి చేసేవారని, గత రాష్ట్ర ప్రభుత్వానికి ఇవేమీ పట్టకపోవడంతో పనులు చేపట్ట లేకపోయారని ఆయన తెలిపారు. త్వరలో మంచినీటి పథకం పనులు పూర్తిచేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సింగర్ చెరువులోని నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

రీసర్వే పేరుతో రెవెన్యూ అధికారుల అవినీతి అక్రమాలు



రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జీవీకి వినతిపత్రం అందచేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

వినుకొండ, జూన్ 26: రీసర్వే పేరుతో ఒకరి భూములు, మరొకరి రికార్డుల్లో ఎక్కించి, కోర్టు వివాదాల్లో ఉన్న భూములకు ఆన్‌లైన్ చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు బుధవారం ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులకు బుధవారం వినతిపత్రం అందచేశారు. వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి రెవెన్యూ పరిధిలోని గ్రామాల్లో రెవెన్యూ అధికారులు పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారని, రికార్డులో భూములు కలిగి న రైతులకు తీరని అన్యాం చేశారని, సర్వేనెంబర్ 256-బీ1లో 45 సెంట్లకు గాను 40 సెంట్లు ఆన్‌లైన్ ఎక్కించారని, 256-ఎ1లో 1.50 సెంట్లు గాను అదనంగా 8 సెంట్లు ఎక్కించారని, ఈ భూమి ప్రస్తుతం వినుకొండ కోర్టులో (దావా నెంబర్ 171-2011)ఉన్నా రెవెన్యూ అధికారులు పెద్దఎత్తున అవినీతికి పాల్పడి కోర్టు వివాదాల్లో ఉన్న భూమిని కూడా ఆన్‌లైన్ చేశారన్నారు. సర్వేనెంబర్ 256-బీ2,బీ1లో రెండు ఎకరాలకుగాను 4 సెంట్లు తగ్గించారని, సర్వేనెంబర్ 220-1-2లలో 2.40 భూమికి గాను 20 సెంట్లు తగ్గించారని, సర్వేనెంబర్ 48/2ఎ-12లో 1.74 ఎకరాలకుగాను కేవలం 85 సెంట్లు మాత్రమే ఆన్‌లైన్ చేశారని ఇలా ఎన్నో తప్పుడు సర్వేలతో అప్పటి తహసీల్దార్, సర్వేయర్, వీఆర్వో కుమ్మక్కై అవినీతి అక్రమాలకు పాల్పడి రైతులను వేధిస్తున్నారని తెలిపారు, ఇప్పటికైనా అవినీతి అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర నాయకులు వై వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు మస్తాన్ వలి, రజక సంఘం నాయకులు సురబి వెంకటేశ్వర్లు, గిరిజన సంఘం నాయకులు వి.కోటానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం కృషి

● జడ్పీటీసీ హైమావతి

మతుకుమల్లి(శావల్యాపురం), జూన్ 26: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను చేరువ చేసి వారిని ఎంతో ప్రోత్సహించి వారి అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని శావల్యాపురం జడ్పీటీసీ పారా హైమావతి అన్నారు. మండలంలోని మతుకుమల్లి జడ్పీ పాఠశాలలో ప్రభుత్వమందించిన స్కూల్ కిట్స్‌ను జడ్పీటీసీ, పల్నాడు జిల్లా తెలుగుయువత ప్రధాన కార్యదర్శి చింతా గంగయ్యల చేతులమీదుగా బుధవారం విద్యార్థులకు అందజేశారు. జడ్పీటీసీ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన పుస్తకాలు, యూనీఫాం, విద్యాసామగ్రిని అందిస్తూ వారిని ప్రభుత్వం ఎంతో ప్రోత్సహిస్తుందన్నారు. గంగయ్య మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని, గతంలో పేద విద్యార్థులకు చంద్రబాబు ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేసి వారంతా విద్యావంతులుగా ఎదిగేలా బంగారు బాటలు వేశారని, తద్వారా ఎంతో మంది విద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడి ఉన్నతస్థాయికి ఎదిగారన్నారు. సర్పంచ్ యలగాల బసవయ్య, హెచ్‌ఎం కృష్ణతులసి, జనసేన మండలాధ్యక్షుడు అడపాల అనిల్‌కుమార్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు మల్నీడి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు యలగాల సాంబయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మతుకుమల్లిలో స్కూల్ కిట్స్ పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ హైమావతి

ప్రీమాన్‌సూన్ డ్రైసోయింగ్ వల్ల భూసారం పెరుగుతుంది

● ప్రకృతి వ్యవసాయశాఖ జిల్లా పీడీ కె.అమలకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ కె.అమలకుమారి

నరసరావుపేట రూరల్, జూన్ 26: ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ వల్ల భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయశాఖ జిల్లా పీడీ కె.అమలకుమారి తెలిపారు. బుధవారం నరసరావుపేట ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో సిబ్బంది పీడీ కె.అమలకుమారి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్ వెంకటరావు, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి పాల్గొని సిబ్బందికి పలు అంశాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా రీజనల్ కో ఆర్డినేటర్ ఎన్ వెంకట్రావు మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పీడీ కే.అమలకుమారి మాట్లాడుతూ ప్రీమాన్‌సూన్ డ్రై సోయింగ్ విత్తనాల కిట్స్‌లో 30 రకాల విత్తనాలు 15 కేజీల కిట్‌గా తయారు చేసి గ్రామాల్లో అందుబాటులో ఉంచామన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అందరూ కాంపాక్ట్ బ్లాక్‌లు ఏర్పాటు చేసి రసాయనాలు లేని వ్యవసాయం చేయాలని తెలిపారు. ఘన జీవా మృతం ప్రతి రైతుతో తయారు చేయించి సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆడిసినల్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ప్రేమ్‌రాజ్, ఎన్ఎఫ్ఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు అవగాహన

ఈపూరు, జూన్ 26: ప్రతి కౌలు రైతు కౌలు కార్డును తీసుకోవాలని మం డల వ్యవసాయాధికారి ఆర్ రామారావు అన్నారు. ఈపూరు రైతు భరోసా కేంద్రం నందు బుధవారం కౌలు కార్డుల ఉపయోగాల రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూపంట నష్టపరిహారం పొందాలన్నా కౌలు కార్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు. కనుక ప్రతి కౌలు రైతు కార్డు లు తీసుకోవాలన్నారు. సమావేశంలో వీఏఏలు ఎం శేషు, రైతులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం

నరసరావుపేట లీగల్, జూన్ 26 : మండలంలోని కేసానుపల్లి వద్ద గల ఎంఏఎం కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రవలిక మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు అత్యంత ప్రమాదకరమైనవన్నారు. వాటి భారిన పడితే జీవితం సర్వనాశనం అవుతుందన్నారు. చట్టపరంగా మాదకద్రవ్యాలు వినియోగించే వారిపై ఉన్న నిబంధనలు అక్రమ రవాణా చేసే వారిపై ఉన్న శిక్షలు, వాటి దుష్పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల నిర్వాహకులు శేషగిరిరావు, శ్రావ్య, సిబ్బంది డాక్టర్ వీరయ్య, రామారావు, ప్రసాదరావు, న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా ఇదే అంశంపై ఎస్పీ మల్లికాగార్గ్, సెబ్ సూపరింటెండెంట్ ఖాజా మొహిద్దీన్‌ల ఆదేశాల మేరకు చైతన్య కళాశాల విద్యార్థులతో సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ వద్దు, జీవితమే ముద్దు తదితర నినాదాలతో ర్యాలీ కొనసాగింది. మొదటి పట్టణ సీఐ కృష్ణారెడ్డి మాదకద్రవ్యాల అక్రమరవాణా చేసే వారు, దుర్వినియోగం చేసే వారికి చట్టపరంగా ఉన్న శిక్ష గురించి వివరించారు. కార్యక్రమంలో సెబ్ సూపరింటెండెంట్ ఖాజా మొహిద్దీన్, సీఐ నయనతార, పోలీసు, సెబ్, ఎక్సైజ్ శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నాదెండ్ల, జూన్ 26 : మాదక ద్రవ్యాల వినియోగం ఎంతో ప్రమాదకరమని చిలకలూరిపేట సెబ్ ఎస్ఐ సీహెచ్ వినీల అన్నారు. మండలంలోని గణపవరం గ్రామంలో గల చుండి రంగ నాయకులు డిగ్రీ కళాశాల నుంచి విద్యార్థులతో కలసి ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వినీల మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలను వినియోగించటం ద్వారా తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. ఎస్ఐ జే బాలరామిరెడ్డి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను వినియోగించే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, సిబ్బంది రవిబాబు, నాగేశ్వరరావు, దిలీప్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాటి అంకమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



కాటి అంకమ్మతల్లి ఆలయం వద్ద పూజలు చేస్తున్న కూటమి నాయకులు

యడ్లపాడు, జూన్ 26: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన సందర్భంగా కూటమి నేతలు బుధవారం స్థానిక కాటి అంకమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి 516 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన అంతరించి రామరాజ్యం వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి జరుగుతుందని అందుకు అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు నేతలు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ ఉమ్మడి గుంటూరుజిల్లా మాజీ అధ్యక్షుడు పోట్రు పూర్ణచంద్రరావు, నాయకులు వి.అంజిరాజు, కె.వెంకటేశ్వర్లు, డి.వెంకటేశ్వరరాజు, టీడీపీ నాయకులు ఉమామహేశ్వరరావు,, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మౌళిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



గణపవరంలో విద్యా సామగ్రిని పంపిణీ చేస్తున్న పుల్లారావు

నాదెండ్ల, జూన్ 26 : విద్యారంగంలో మౌళిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని గణపవరంలో గల కెల్లంపల్లి భద్రాచలం పాఠశాలతో పాటు చిలకలూరిపేట సమీపంలోని మురికిపూడి గ్రామంలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రిని బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పుల్లారావు పాఠశాలల్లో జరుగుతున్న విద్యా బోధన, మౌలిక వసతులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాసనసభ్యుడిగా తాను ఎన్నికైన తరువాత తొలి ప్రభుత్వ కార్యక్రమం ఇదేనని, పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో రాణిస్తున్న తెలుగు వారే ఇందుకు నిదర్శనం అన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్ నాయకత్వంలో పాఠశాలల రూపురేఖలు మారనున్నాయన్నారు. విద్యా కిట్లపై జగన్ ఫోటో ఉన్నప్పటికీ సమయానికి విద్యార్థులకు ఇవ్వాలన్న ఉద్దేశంతో ఆ విద్యా కిట్లను పంపిణీ చేయాలని చెప్పిన గొప్ప మనస్సున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, చిలకలూరిపేట మండల అధ్యక్షుడు జవ్వాజి మదన్, హెచ్‌ఎం కృష్ణానాయక్, నాయకులు ఎం లక్ష్మీనారాయణ, శేషయ్య, అచ్చయ్య, జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కాలి నడకన తిరుపతికి పాదయాత్ర



వెల్లటూరులో కాలినడకన తిరుపతికి గోవిందు లక్ష్మీనారాయణ పాదయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

బొల్లాపల్లి, జూన్ 26: మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన గోవిందు లక్ష్మీనారాయణ కూటమి అధికారంలోకి రావాలి, చంద్రబాబు నాయుడు సీఎం కావాలని, వినుకొండ ఎమ్మెల్యేగా జీవీ ఆంజనేయులు విజయం సాధిస్తే కాలి నడకన తిరుపతికి నడిచి వస్తానని మొక్కుకున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వెల్లటూరు గ్రామానికి చేరుకొని గోవిందు లక్ష్మీనారాయణ కుటుంబసభ్యులకు కాలినడకన తిరుపతి బయలు దేరుతున్న సందర్భంగా జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ గోవిందు లక్ష్మీనారాయణ పార్టీ గెలిస్తే తిరుపతికి కాలి నడకన వస్తాన ని మొక్కు కోవటం అభినందనీయమన్నారు. పార్టీపై ఆయనకున్న అభిమానం వెల కట్టలేనిదన్నారు. ఈ తిరుపతి యాత్ర మంచి జరగాలని ఆయన ఆకాంక్షించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి : ఎమ్మెల్యే జీవీ

బొల్లాపల్లి, జూన్ 26 : మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వినుకొండ ఎమ్మెల్యే జీవీ అంజనేయులు బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నేను బడికి పోతా, పిల్లలు ఉండాల్సింది పనిలో కాదు బడిలో అని విద్యార్థులకు, అక్కడకు వచ్చిన వారికి సూచించారు. అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పని చేయాలని అన్నారు. పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించిన విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జప్రుల్లా ఖాన్, హెచ్‌ఎం షేక్ అలీసా, టీడీపీ నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, జరపాల గోవిందు నాయక్, బీ నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, వెంకట నారాయణ, వెంకటేశ్వర్లు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

నేడు పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట, జూన్ 26: గణపవరం సెక్షన్‌లో కొత్త లైన్‌ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపి వేస్తారని విద్యుత్‌శాఖ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ బుధవారం తెలిపారు. స్టేట్ బ్యాంక్ రోడ్డు, సాయి బాబా టెంపుల్ రోడ్డు, చిలకలూరిపేట డొంక రోడ్డు, తిరుమల, లక్ష్మీ రైస్ మిల్లుల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని తెలిపారు.

8, 9, 10 తేదీల్లో ఏఐఎస్ఎఫ్ శిక్షణా తరగతులు

చిలకలూరిపేట, జూన్ 26: కాకినాడలో జూలై 8, 9, 10 తేదీల్లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల నాసర్‌జీ బుధవారం తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఇక్కడ విడుదల చేశారు. విద్యారంగంలో వస్తున్న మార్పులపై, సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై విద్యార్థుల్లో చైతన్యం నింపటానికి శిక్షణా తరగతులు ఉపయోగపడతాయని ఆయన అన్నారు. నీట్ పరీక్షను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఏఐఎస్ఎఫ్ నాయకులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం, పోర్‌వీలర్ ఆటో ఢీ.. ఒకరు మృతి

వినుకొండటౌన్, జూన్ 26: ద్విచక్రవాహనం. పోర్‌వీలర్ ఆటో ఎదురెదురుగా ఢీ కొనడంతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. మృతుడి స్నేహితులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే నూజండ్ల మండలం నాగిరెడ్డిపల్లి గ్రామనిక చెందిన షేక్ మీరావలి (28) వినుకొండలో శ్రీరామ్ చిట్‌లో పనిచేస్తున్నాడని, 6 నెలల క్రితం వివాహం జరిగిందని, గ్రామానికి చెందిన చాపల మడుగు నాసర్‌వలితో కలిసి ద్విచక్రవాహనం స్వగ్రామానికి వెళ్తుండగా ప్రమాదం జరిగిందని తెలిపారు. వాహనం నడుపుతున్న మీరావలి మృతి చెందగా, వెనుక కూర్చున్న నాసర్‌వలి గాయపడటంతో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు వారు తెలిపారు. వాహనదారులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా ప్రాంతానికి చేరుకున్న ఎస్ఐ లక్ష్మీ ప్రసాద్‌ను వివరణ కోరగా ఇంకా కేసు నమోదు చేయలేదన్నారు.

భార్య మృతికి కారకుడైన భర్త అరెస్టు

నరసరావుపేట లీగల్, జూన్ 26 : భార్య మృతికి కారకుడైన భర్త పూర్ణ చంద్రరావు అతని తల్లిదండ్రులు పద్మావతి అంకమ్మరావులను అరెస్టు చేసినట్లు రెండో పట్టణ పోలీసులు బుధవారం తెలిపారు నిందితుల వరకట్న వేధింపుల నేపథ్యంలో ఇటీవల పట్టణంలోని ఇలా బజారుకు చెందిన పల్లవి అనే వివాహిత బలవన్మరణానికి పాల్పడింది కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం బుధవారం నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు వారిని స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎదుట హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు

పాఠశాల అభివృద్ధికి విరాళం

ఈపూరు, జూన్ 26: మండలంలోని బోడెపూడివారిపాలెం ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం గ్రామానికి చెందిన యలవర్తి చిన వీరాంజనేయులు రూ.10వేలు నగదు విరాళంగా అందజేశారు. పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన విద్యాకానుక కిట్లు చిన్న వీరాంజనేయులు, శ్రీనివాసరావులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.